


TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 69 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 22 అక్టోబర్ 2026 | వెల : 4/-


# మహిళల భద్రతకు ప్రాధాన్యం



## పోలీస్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం

## శాంతి భద్రతలు బాగుంటేనే రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా ఉంటుంది

## అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది

**"పోలీస్ శాఖను బలోపేతం చేసేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. పోలీసుశాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం. మిగతా ఖాళీలను కూడా విడతల వారీగా భర్తీ చేస్తాం. 2028 నాటికి పోలీసుశాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తాం. పోలీసుశాఖలో ఎక్స్‌గ్రేషియాను హోదా ఆధారంగా రూ.కోటికి పైగా పెంచాం"**

హైదరాబాద్

ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నివాళులర్పించింది. వారి కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచామని వెల్లడించారు. 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో మహిళా భద్రత, డ్రగ్స్ గంజాయి సైబర్ నేరాల కట్టడి, కల్తీ ఆహారంపై ప్రభుత్వ చర్యలపై సీఎం వివరాలు వెల్లడించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ స్మారక పరేడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, - మిగతా3లో

# ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లకు 25 శాతం సీట్లు

- అమలు చేసేందుకు వడివడిగా అడుగులు
- నిరుపేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించని నేపథ్యంలో సుప్రీం కోర్టు ఆగ్రహించింది
- ఈనేపథ్యంలో అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



హైదరాబాద్

సమాజంలోని ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లల కోసం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించే విషయంలో పురోగతి కనిపిస్తోంది. దశాబ్దాలు గడిచినా అనేక రాష్ట్రాలు ఈ నిబంధనను అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు ఇటీవల 'జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం' (ఎన్‌సీపీసీఆర్)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 27న జరగనున్న విచారణకు స్వయంగా హాజరై అమలు తీరుపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎన్‌సీపీసీఆర్‌ని ఆదేశిం చింది. ఈ నేపథ్యంలో ఎన్‌సీపీసీఆర్ - మిగతా3లో



# డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

- 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మార్చుమే మా లక్ష్యం
- దిల్లీలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి
- రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి

# పల్లె జేబుకు ధరల చిల్లు!



- తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో సెప్టెంబర్‌లో 7.21 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం
- దేశ సగటు గ్రామీణ ద్రవ్యోల్బణం 6.08 శాతంకన్నా ఎక్కువగా నమోదు
- ఉల్లి, టమాటా ధరలకు రెక్కలు.. నెల రోజుల్లోనే రెట్టింపు
- కూలీ రేట్లు పెరగక, వర్షాల్లేక పడిపోతున్న గ్రామీణుల కొనుగోలు శక్తి

హైదరాబాద్

పండుగల సమయంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ కుటుంబాలపై ధరల భారం రోజురోజుకూ పెరుగుతోంది. ఒకవైపు కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే మరోవైపు కూలీ రేట్లు ఆ స్థాయిలో పెరగకపోవడం, వర్షాభావంతో పంటలు దెబ్బతినడం పల్లె ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నాయి. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌పీఐ) తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం - మిగతా3లో

# దిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం



- అమల్లోకి వచ్చిన గ్రాఫ్ స్టేజ్1 ఆంక్షలు
- కాలుష్య నియంత్రణ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు
- దిల్లీ–ఎన్‌సీఆర్ అంతటా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) తొలి దశ అమలు చేశారు.




# దిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం



దేశ రాజధాని దిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత సూచీ దిగజారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసేందుకు దిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ) స్టేజ్–1ను తక్షణమే అమలు చేస్తున్నట్లు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) బుధవారం ప్రకటించింది. రానున్న రోజుల్లోనూ గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

### ఒక్కరోజులోనే పెరిగిన కాలుష్యం

దిల్లీలో అక్టోబర్ 20న వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 179గా నమోదైంది. ఇది 'మోస్తరు' కేటగిరీ పరిధిలోకి వస్తుంది. అయితే అక్టోబర్ 21న మధ్యాహ్నం 2 గంటలకు ఈ సూచీ 244కు చేరింది. దీంతో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలోకి వెళ్లింది. ఒక్కరోజు వ్యవధిలోనే కాలుష్య స్థాయిలు గణనీయంగా పెరగడం అధికారులను అప్రమత్తం చేసింది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లోనూ దిల్లీలో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో కొనసాగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితిని సమీక్షించిన, భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు కాలుష్యాన్ని మరింత పెరగకుండా నిరోధించేందుకు తొలి దశ చర్యలను అమలు చేయాలని నిర్ణయించింది.

### జీఆర్‌ఏపీ స్టేజ్–1 ఎందుకు?

వాయు కాలుష్యం పెరుగుతున్నప్పుడు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి దశలవారీగా చర్యలు చేపట్టే విధానమే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్. గాలి నాణ్యత ఆధారంగా వివిధ దశల్లో నియంత్రణ చర్యలను అమలు చేస్తారు. ప్రస్తుతం దిల్లీలో ఏక్యూఐ 244కు చేరడంతో తొలి దశను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ నిర్ణయం దిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వర్తిస్తుందని సీఏక్యూఎం స్పష్టం చేసింది. సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, అమలు చేసే ఇతర విభాగాలు తమ పరిధిలోని చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించింది. ఇప్పటికే అమల్లో ఉన్న కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. గాలి నాణ్యత మరింత దిగజారకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపింది. పౌరులు కూడా జీఆర్‌ఏపీ స్టేజ్–1లో సూచించిన మార్గదర్శకాలను పాటించాలని కోరింది.

### పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం

దిల్లీతో పాటు ఎన్‌సీఆర్‌లో గాలి నాణ్యతను అధికారులు నిరంతరం గమనిస్తారని సీఏక్యూఎం తెలిపింది. వాయు కాలుష్య స్థాయిలు, వాతావరణ శాఖలు వెల్లడించే భవిష్యత్ అంచనాలను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. అవసరాన్ని బట్టి అదనపు చర్యలపై సమీక్ష ఉంటుందని వెల్లడించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. జీఆర్‌ఏపీ తొలి దశ అమలుతో కాలుష్య నియంత్రణకు సంబంధించిన ప్రస్తుత చర్యలను ముమ్మరం చేయడంపై అధికారులు దృష్టి సారించనున్నారు.

### గత పదేళ్లలో కాలుష్యం తీవ్ర సమస్య: మంత్రి

దిల్లీలో వాయు కాలుష్యంపై పర్యావరణ శాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా ఆందోళన వ్యక్తం చేశారు. గత పదేళ్ల నుంచి 12 ఏళ్ల కాలంలో రాజధానిలో గాలి నాణ్యత తీవ్రంగా దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాలు కాలుష్యానికి పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్ వంటి రాష్ట్రాలను బాధ్యులుగా చూపుతూ వచ్చాయని, అయితే సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేకపోయాయని విమర్శించారు. అదే సమయంలో ప్రస్తుత ఏడాదిలో ఇప్పటివరకు 214 రోజులు 'గుడ్' లేదా 'మోడరేట్' కేటగిరీల్లో గాలి నాణ్యత నమోదైందని మంత్రి వెల్లడించారు. కొవిడ్ ప్రభావిత సంవత్సరాన్ని మినహాయించి చూస్తే, గత 12 ఏళ్లలో ఇదే అత్యధికమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలతో పాటు దిల్లీ ప్రజల సహకారం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని తెలిపారు.

# ఆందోళనలు హింసకు దారితీస్తాయి




ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా దాఖలు చేసిన పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు కీలక సూచనలు చేసింది. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వద్ద విచారణ పూర్తయ్యే వరకు వేచి చూడాలని పేర్కొంది. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే అప్పీలేట్ కోర్టును ఆశ్రయించాలని జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ ధర్మాసనం సూచించింది. అలాగే ఫ్రాన్స్‌లో విద్యార్థుల ఆందోళనలు అగ్నిప్రమాదాలు, దోపిడీలకు దారితీసిన పరిణామాలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. దీంతో సీజేపీ నేతలు హైకోర్టులో తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోశ్ రాంకాలను అక్టోబర్ 13న పోలీసులు అరెస్టు చేశారు. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టే క్రమంలో వారు పోలీసుల బారికేడ్లను దాటి అక్కడికి ప్రవేశించినట్లు ఆరోపణలు ఉన్నాయి. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేసినట్లు పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌ను నిరసన ప్రదేశంగా గుర్తించిన అనుమతులను రద్దు చేసిన తర్వాత అక్కడికి వెళ్లడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ న్యాయ కస్టడీని పొడిగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సీజేపీ నేతలు దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. వారి కస్టడీ గడువు బుధవారంతో ముగియున్న నేపథ్యంలో పిటిషన్?ను అత్యవసరంగా విచారించేందుకు న్యాయస్థానం అంగీకరించింది. అయితే ప్రత్యామ్నాయ న్యాయ మార్గాలను అనుసరించకుండా నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ధర్మాసనం ప్రశ్నించింది. సంబంధిత ఎస్ఈఎం విచారణ కోసం వేచి చూడాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించింది. దీంతో పిటిషనర్లు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

### బారికేడ్లు దాటడంపై కోర్టు అభ్యంతరం

జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ నేతృత్వంలోని ధర్మాసనం నిరసనల నిర్వహణలో పోలీసుల అనుమతి ప్రాధాన్యాన్ని వివరించింది. జంతర్‌మంతర్ నిరసన ప్రదేశంగా గుర్తింపు కోల్పోయిన తర్వాత కూడా అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించింది. బారికేడ్లను ఏర్పాటు చేయడం వెనుక నిర్దిష్టమైన ఉద్దేశం ఉంటుందని, వాటిని దాటడం వల్ల ఇతరులు కూడా ఆ ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని పేర్కొంది. నిరసనకారుల నియంత్రణలో లేని వ్యక్తులు అక్కడికి చేరితే పరిస్థితులు సంక్లిష్టంగా మారవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. ఆందోళనకు సంబంధం లేని వారు ప్రవేశించి గందరగోళం సృష్టిస్తే, దాని ప్రభావం అసలు నిరసనకాలపైనా పడే ప్రమాదం ఉంటుందని సూచించింది. నిరసనలకు అనుమతి తీసుకోవడం అనేది ఆందోళనలను అడ్డుకోవడానికి మాత్రమే కాదని కోర్టు స్పష్టం చేసింది. ఇతరులు వచ్చి పరిస్థితులను చెడగొట్టకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడటం కూడా పోలీసుల అనుమతి విధానంలో కీలక ఉద్దేశమని వివరించింది.

### ఫ్రాన్స్ అల్లర్లతో పోలిక ఎందుకు?

విద్యార్థుల ఆందోళనలుగా ప్రారంభమైన నిరసనలు హింసాత్మక ఘటనలకు దారితీసిన ఉదంతాలు దేశ సరిహద్దులకు పరిమితం కాలేదని హైకోర్టు పేర్కొంది. ఫ్రాన్స్‌లో విద్యార్థుల నేతృత్వంలో మొదలైన నిరసనలు చివరకు నిప్పంటించే ఘటనలు, దోపిడీలకు దారితీసిన పరిణామాలను ఉదాహరణగా ప్రస్తావించింది. నిరసన ప్రారంభమైనప్పుడు దాని ఉద్దేశం ఒకటిగా ఉన్నా, ఆ తర్వాత పరిస్థితులు మారే అవకాశం ఉంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు నిరసన నిర్వాహకులు ఎవరు? వారి అనుబంధ సంస్థ ఏమిటి? ఆ సంఘం లక్ష్యాలేంటి? అనే అంశాలు ప్రాధాన్యం సంతరించుకుంటాయని పేర్కొంది. అయితే, నిషేధం లేదా అనుమతి రద్దు చేసిన ప్రదేశంలో నిరసన చేపట్టడం ఎంతవరకు తీవ్రమైన చర్యగా పరిగణించాలనే అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. బారికేడ్లు దాటి వెళ్లిన వ్యవహారంపై చట్టపరమైన అంశాలను ప్రత్యేకంగా పరిశీలిస్తామని తెలిపింది. నిరసన నిర్వహించిన తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆ చర్యల చట్టబద్ధతను పరిశీలించడం వేరే అంశమని ధర్మాసనం పేర్కొంది.

### 'మీరు జెన్–జెడ్ కాదు'

విచారణ సందర్భంగా సీజేపీ నేతల వయసును కూడా ధర్మాసనం అడిగి తెలుసుకుంది. సౌరవ్ దాస్ వయసు 26 ఏళ్లు కాగా, ఆశుతోశ్ రాంకా వయసు 31 ఏళ్లు. వారి వయసుల నేపథ్యంలో మీరు జెన్–జెడ్ తరానికి చెందినవారు కాదని వ్యాఖ్యానించిన న్యాయమూర్తి మిలీనియల్స్ ఏ వయో వర్గానికి చెందుతారని సరదాగా ప్రశ్నించారు. విద్యార్థుల ఉద్యమంగా మొదలైన నిరసన క్రమంగా వేరే స్వరూపం సంతరించుకుందనే విషయాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. నిరసనలో పాల్గొనే వ్యక్తులు మారకపోయినా, వారి ఆందోళనకు సంబంధించిన కారణాలు మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది. శాంతిభద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉందనే అనుమానం ఏర్పడినప్పుడు నిర్వాహకుల నేపథ్యం, సంస్థ లక్ష్యాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వివరించింది.

## అంగరంగా వైభవంగా 'జంబూ సవారీ'

## మైసూరులో ఘనంగా దసరా సంబరాలు

కర్ణాటకలోని మైసూరు నగరం విజయదశమి వేడుకలతో సందడిగా మారింది. 11 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన మైసూరు దసరా ఉత్సవాల ముగింపు ఘట్టంలో భాగంగా బుధవారం విజయదశమి ఊరేగింపు ప్రారంభమైంది. రాష్ట్ర పండుగగా జరుపుకునే ఈ ఉత్సవాలు కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు, పూర్వపు రాజవైభవాన్ని ప్రతిబింబించాయి. సాయంత్రం జరిగే ప్రసిద్ధ 'జంబూ సవారీ'ని వీక్షించేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. 'ప్రశాంత' అనే ఏనుగు నేతృత్వంలో అలంకరించిన 12 ఏనుగులు ఈ ఊరేగింపులో పాల్గొననున్నాయి. 750 కిలోల బరువున్న బంగారు పూత పూసిన అంబారీలో చాముండేశ్వరి దేవి విగ్రహాన్ని ఉంచి ఊరేగించడం ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మైసూరు దసరా వేడుకలను వీక్షించేందుకు వివిధ దేశాలకు చెందిన దౌత్యవేత్తలు, విదేశీ ప్రముఖులు హాజరయ్యారు. యూరోపియన్ యూనియన్ రాయబారి జీన్–ఎరిక్ పాక్వెట్, చైనా రాయబారి జు ఫీహాంగ్, భారతదేశంలో ఈక్వెడార్ రాయబారి ఫెర్నాండో బుచెలి, మొజాంబిక్ హైకమిషనర్ అర్మాండో పెడ్రో, బల్గేరియా రాయబారి నికోలే యాంకోవ్, బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ హర్బీర్ సంఘూ ఈ కార్యక్రమానికి వచ్చిన వారిలో ఉన్నారు. కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి బసవరాజ్ రాయరెడ్డి వారికి స్వాగతం పలికారు. డానిష్ కాన్సుల్ జనరల్ పీటర్ వింతర్, ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ ఓర్లీ వీట్జ్‌మాన్, ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్, అర్మేనియా రాయబార కార్యాలయ కౌన్సిలర్ మారత్ మెలికియన్ కూడా వేడుకల్లో పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఆహ్వానం మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, కేరళకు చెందిన ప్రముఖ నాయకుడు వి.డి. సతీశన్ కూడా ఈ ఏడాది వేడుకలకు హాజరవుతున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దేశ, విదేశాల ప్రముఖుల రాకతో మైసూరు దసరా ఉత్సవాలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

### రాజవంశ సంప్రదాయాలకు ప్రత్యేక పూజలు

మైసూరు రాజప్రాసాదంలో విజయదశమి సందర్భంగా సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. పూర్వపు మైసూరు రాజవంశ వారసుడు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్ అంబ విలాస్ ప్యాలెస్ నుంచి అదే ప్రాంగణంలోని భువనేశ్వరి దేవి ఆలయం వరకు 'విజయ యాత్ర' చేపట్టారు. అక్కడ శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1.36 గంటల నుంచి 1.56 గంటల మధ్య శుభప్రదమైన మకర లగ్నంలో ప్రధాన ఊరేగింపు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అంబ విలాస్ ప్యాలెస్‌లోని బలరామ ద్వారం వద్ద డి.కె. శివకుమార్, ఇతర మంత్రులు, ప్రముఖులు 'నంది ధ్వజం'కు పూజలు చేశారు. అనంతరం విజయదశమి ఊరేగింపునకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఊరేగింపు ప్రారంభానికి కొన్ని గంటల ముందే ప్రజలు మార్గమధ్యంలో పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు.

## డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రానున్న మూడేళ్ల పాటు ఉమ్మడిగా పోరాడి మాదకద్రవ్యాల మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టాలని అమిత్ షా పిలుపునిచ్చారు. డ్రగ్స్ వల్ల భవిష్యత్ తరాలు నాశనం కావడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోందని తెలిపారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థలకు కూడా డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా ఆర్థిక సాయం అందుతోందని పేర్కొన్నారు. దిల్లీలో బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక నిర్ణయం తీసుకుంది. 2026 సంవత్సరంలో మిగిలిన భాగం, 2027, 2028, 2029 ఈ మూడున్నరేళ్లలో డ్రగ్స్ వ్యతిరేకంగా ఒక ఉమ్మడి పోరాటం చేసి, 2029 డిసెంబర్ 31 నాటికి దేశానికి డ్రగ్స్ సమస్య నుంచి విముక్తి కలిగిస్తాం. ఇది మనకు అత్యంత ముఖ్యమైన లక్ష్యం. మూడు హాట్‌స్పాట్‌లను ఎదుర్కోవడం కంటే కూడా ఇది ఎంతో ముఖ్యమైంది. ఎందుకంటే డ్రగ్స్ సమస్య మన భావి తరాలను డొల్లగా మారుస్తుంది. ఆర్థిక వ్యవస్థపై అనవసరమైన భారాన్ని మోపుతుంది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థలకు ఆర్థిక సహాయం అందించడం కూడా ఈ డ్రగ్స్ దందా నుంచే జరుగుతుంది."

### డ్రగ్స్‌తో భావితరాలకు ముప్పు

మాదకద్రవ్యాల సమస్య కేవలం వ్యక్తులకు సంబంధించినది మాత్రమే కాదని, అది దేశ భవిష్యత్తుపైనా ప్రభావం చూపుతుందని అమిత్ షా అన్నారు. అందువల్ల మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం జాతీయ భద్రతకు కూడా కీలకమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'డ్రగ్స్‌పై పోరాటం' అనే థీమ్‌తో చేపట్టిన భారీ మోటార్ సైకిల్ ర్యాలీని అమిత్ షా జెండా ఊపి ప్రారంభించారు. తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 90 మంది పోలీసులతో కూడిన రైడర్లు ఇందులో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహనను పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ ర్యాలీలో పాల్గొనే రైడర్లు అక్టోబర్ 31న గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించే ఏక్తా పరేడ్‌లో పాల్గొంటారని అధికారిక ప్రకటన తెలిపింది. జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, చండీగఢ్, దిల్లీ ప్రాంతాలతో పాటు పలు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ఇతర కేంద్ర పోలీసు సంస్థల సిబ్బంది ఈ కార్యక్రమంలో భాగమయ్యారు.

### నక్సలిజం నిర్మూలనలో పోలీసుల పాత్ర కీలకం

అలాగే దేశంలో దశాబ్దాలుగా కొనసాగిన నక్సలిజాన్ని 2026 మార్చి 31 నాటికి నిర్మూలించామని అమిత్ షా పేర్కొన్నారు. ఈ పోరాటంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్), దాని కోబ్రా బెటాలియన్ కీలక పాత్ర పోషించాయని ప్రశంసించారు. భద్రతా బలగాల త్యాగాలు, అంకితభావం వల్లే ఈ లక్ష్యాన్ని సాధించగలిగామని అన్నారు. 1981 నుంచి 2026 మార్చి మధ్య నక్సలిజానికి సంబంధించిన హింసాకాండలో 3,600 మందికి పైగా భద్రతా సిబ్బంది, సుమారు 13,700 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని అమిత్ షా తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన సిబ్బందికి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా కొనసాగిన నక్సలిజం సమస్యను అధిగమించి దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి భద్రతా సిబ్బంది చేసిన త్యాగాలు పునాది వేశాయని అమిత్ షా అన్నారు. అమరుల కుటుంబాల త్యాగాలను యావత్ దేశం గుర్తిస్తుందని, వారికి ప్రగాఢ కృతజ్ఞతలు తెలుపుతోందని పేర్కొన్నారు.

### అమర పోలీసులకు ప్రధాని మోదీ నివాళులు

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసులకు ఎక్స్ మాధ్యమంలో ప్రధాని నరేంద్ర మోదీ నివాళులర్పించారు. శాంతి భద్రతలను కాపాడటం, నేరాలను అరికట్టడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించడం వంటి విషయాల్లో పోలీసుల కృషి వెలకట్టలేనిదని ప్రధాని కొనియాడారు. సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో అత్యంత నిబద్ధతతో పనిచేస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు చెప్పేందుకు పోలీసుల సంస్మరణ దినోత్సవం ఒక మంచి సందర్భం అని పేర్కొన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 21న జాతీయ పోలీసు సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. 1959 అక్టోబర్ 21న లద్దాఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో భారీగా ఆయుధాలు ధరించిన చైనా సైనికులు జరిపిన దాడిలో 10 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## జాతీయ భద్రతను పరిరక్షించడంలో కేంద్రం విఫలం

### మణిపుర్ హింసాకాండపై కాంగ్రెస్

మణిపుర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో, రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంలో, జాతీయ భద్రతను రక్షించడంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇటీవల నలుగురు అమాయక పౌరులు హత్యకు గురికావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మే 2023 నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 24,530 మంది సహాయక శిబిరాల్లో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకున్న చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### మళ్లీ రక్తసిక్తమైన మణిపుర్

మణిపుర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండలో నలుగురు అమాయక పౌరులు దారుణంగా హత్యకు గురికావడాన్ని ఖర్గే ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ అసమర్థత వల్లే రాష్ట్రం మళ్లీ రక్తసిక్తమవుతోందని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మే 2023లో లోయ ప్రాంతానికి చెందిన మైతీ వర్గానికి, కొండ ప్రాంతానికి చెందిన కుకీ వర్గానికి మధ్య ప్రారంభమైన జాతి ఘర్షణలు రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని పేర్కొన్నారు. ఈ హింసాకాండలో ఇప్పటివరకు కనీసం 306 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 49 మంది ఆచూకీ తెలియకుండా పోయిందని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ ఘర్షణల ప్రభావాన్ని మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఇప్పటికీ ఎదుర్కొంటున్నాయని ఖర్గే అన్నారు. వేలాది మంది తమ ఇళ్లకు దూరంగా సహాయక శిబిరాల్లో జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడం, బాధితులకు భద్రత కల్పించడం, నిర్వాసితులను తిరిగి వారి నివాసాలకు చేర్చడం వంటి అంశాల్లో కేంద్రం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

### మోదీ, అమిత్ షాకు మూడు ప్రశ్నలు

మణిపుర్ పరిస్థితులపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మూడు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. జూన్ 2023లో అమిత్ షా ఏర్పాటు చేసిన శాంతి కమిటీకి ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించడానికి, పౌరులను రక్షించడానికి, భద్రతాపరమైన సవాళ్లను పరిష్కరించడానికి ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటని నిలదీశారు. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సిఫార్సులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు. సహాయక శిబిరాల్లో 31 అసహజ మరణాలు సంభవించినట్లు సుప్రీంకోర్టు వెల్లడించినప్పటికీ, వేలాది మంది ఇంకా ఎందుకు నిరాశ్రయులుగా ఉన్నారని ఖర్గే ప్రశ్నించారు. మహిళలు, పిల్లలు, నిర్వాసిత కుటుంబాల భద్రత, గౌరవం, పునరావాసం కోసం ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడేళ్లకు పైగా కాలం గడిచినా పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం, ముఖ్యమంత్రిని మార్చడం, తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం వంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నా శాంతి నెలకొనలేదని ఖర్గే అన్నారు. హింస ప్రారంభమైన తర్వాత దాదాపు 29 నెలల పాటు మణిపుర్‌లో అడుగుపెట్టని ప్రధాని మోదీ, పార్లమెంటులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇంతటి పాలనా వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అమాయకుల ప్రాణాలు మరెన్ని కోల్పోతే కేంద్రం స్పందిస్తుందని నిలదీశారు. మణిపుర్‌కు న్యాయం, గౌరవం, రాజ్యాంగ హక్కులు, శాశ్వత శాంతి లభించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర భద్రత, స్థిరత్వాన్ని బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టకూడదని హెచ్చరించారు. అలాగే మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రధాని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఖర్గే ఆరోపించారు.

# పల్లె జేబుకు ధరల చిల్లు!

-మొదటిపేజీ తరువాయి

సెపటటంబర్‌లో తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.64 శాతానికి చేరింది. ఆగస్టులో ఇది 6.27 శాతంగా ఉంది. ఈ ఏడాదిలో రాష్ట్రంలో ఇదే అత్యధికం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 7.21 శాతంగా నమోదవగా పట్టణ ప్రాంతాల్లో 6.21 శాతంగా ఉంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ద్రవ్యోల్బణం 6.08 శాతంగా ఉంటే రాష్ట్రంలోని పల్లెల్లో అంతకంటే ఒక శాతానికిపైగా ఎక్కువగా ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా సెపట?టంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి చేరింది. ఇది 23 నెలల గరిష్ట స్థాయి. ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.97 శాతం ఉండగా సెపట?టంబర్‌లో 7.74 శాతానికి ఎగబాకింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం 8.06 శాతానికి చేరింది. దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు గతేడాదితో పోలిస్తే 108 శాతం పెరిగాయి. పట్టణ కుటుంబాలతో పోలిస్తే గ్రామీణ కుటుంబాలు తమ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ఆహారానికే ఖర్చు చేస్తాయి. దీంతో ఆహార ధరల పెరుగుదల ప్రభావం పల్లెలపైనే ఎక్కువగా పడుతోంది.



### కూలీ పెరగలేదు.. ఖర్చు పెరిగింది

ధరలు పెరుగుతున్న స్థాయిలో గ్రామీణ కూలీల వేతనాలు పెరగడం లేదు. కేంద్ర కార్మిక బ్యూరో గణాంకాల ప్రకారం ఏప్రిల్--జూన్ మధ్య పురుషుల కూలీ రేట్లు 16 శాతానికి పైగా, మహిళల కూలీ 21 శాతం మేర పెరగగా, జూలై--ఆగస్టులో ఆ వృద్ధి పురుషులకు 3 శాతానికి, మహిళలకు 4 శాతం లోపునకు పడిపోయింది. ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకుంటే వ్యవసాయ కూలీల వాస్తవ వేతనాలు ఆగస్టులో 1.9 శాతం, వ్యవసాయేతర కూలీల వాస్తవ వేతనాలు 2.1 శాతం తగ్గాయి. అంటే కూలీకి వచ్చే డబ్బుతో గతేడాది కొన్నన్ని సరుకులు కూడా ఇప్పుడు కొనలేని పరిస్థితి. ఉపాధి హామీ పథకం స్థానంలో వచ్చిన కొత్త పథకం వీబీజీ రామ్‌జీ కింద రాష్ట్రంలో రోజువారీ కూలీని జూలై 1 నుంచి రూ. 308గా కేంద్రం నిర్ణయించింది. అయితే కొత్త పథకం అమలులో ప్రారంభ ఇబ్బందుల కారణంగా పనిదినాలు గతంతో పోలిస్తే తగ్గాయన్న విమర్శలు వస్తున్నాయి. వ్యవసాయ పనులు లేని సీజన్‌లో ఉపాధి పనులే ఆధారమైన కూలీ కుటుంబాలపై ఇది మరింత భారం మోపుతోంది.

### కరువుతో రైతుల చేతిలో డబ్బేది?

గ్రామీణ కొనుగోలు శక్తికి మూలమైన వ్యవసాయ ఆదాయాన్ని కరువు దెబ్బతీస్తోంది. రాష్ట్రంలోని 621 మండలాలకుగాను 315 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే కేంద్రానికి నివేదించారు. రాష్ట్రంలో 17 శాతం లోటు వర్షపాతం నమోదవగా ఆదిలాబాద్ జిల్లాలో లోటు 35 శాతానికి చేరింది. జిల్లాలోని 20 మండలాల్లో ఒక్కటి మినహా అన్నింటిలోనూ 24 నుంచి 45 శాతం లోటు నమోదైంది.

పత్తి, సోయాబీన్, కంది పంటలు ఎండిపోతుండటంతో పెట్టుబడుల కోసం బ్యాంకులు, ప్రైవేటు వ్యాపారుల వద్ద తెచ్చిన అప్పులు తీర్చలేక ఆ జిల్లాలోనే ఈ నెలలో ఐదుగురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. దిగుబడులు తగ్గితే రైతుల చేతికి వచ్చే డబ్బు తగ్గి ఆ ప్రభావం గ్రామాల్లోని దుకాణాలు, వాహన షోరూంల వరకు విస్తరిస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దసరా, దీపావళి పండుగలు, ఖరీఫ్ పంట చేతికి రావడంతో సమీప భవిష్యత్తులో గ్రామీణ డిమాండ్‌కు కొంత ఊతం లభించవచ్చని.. అయితే పండుగల సందడి ముగిశాక అసలు పరిస్థితి బయటపడుతుందని అంటున్నారు.

### కూరగాయల ధరలు కుతకుత

రాష్ట్రంలో ఉల్లి, టమాటా ధరలు సామాన్యుడికి కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. నెల క్రితం కిలో రూ. 30 ఉన్న ఉల్లి ధర బహిరంగ మార్కెట్‌లో ఇప్పుడు రూ. 55 నుంచి రూ. 70 వరకు పలుకుతోంది. రైతుబజార్లలో కిలో రూ. 40 నుంచి రూ. 50కి విక్రయిస్తున్నారు. మలక్‌పేట హోల్‌సేల్ మార్కెట్‌లో ఆదివారం క్వింటాల్ ఉల్లి కనిష్టంగా రూ. 3,600, గరిష్టంగా రూ. 4,600 పలికింది. రెండు వారాల క్రితం రోడ్డు పక్కన కిలో రూ. 20కి దొరికిన టమాటా ఇప్పుడు రూ. 50కి చేరింది. సూపర్ మార్కెట్లలో రూ. 60 వరకు అమ్ముతున్నారు.

వంకాయ, బెండ, పచ్చిమిర్చి, కాకర, బీర వంటి కూరగాయలన్నీ కిలో రూ. 60 దాటాయి. కూకట్‌పల్లి రైతుబజార్‌లో అల్లం కిలో రూ. 120, వెల్లుల్లి రూ. 260, ఎండుమిర్చి రూ. 280, చింతపండు రూ. 160 పలుకుతున్నాయి. ధరల దెబ్బకు గతంలో వారానికి మూడు నాలుగు కిలోల ఉల్లి కొనే కుటుంబాలు ఇప్పుడు కిలోతోనే సరిపెట్టుకుంటున్నాయి. మహారాష్ట్ర, కర్నూలు నుంచి రావాల్సిన ఉల్లి సరఫరా తగ్గడమే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

# మహిళల భద్రతకు ప్రాధాన్యం

-మొదటిపేజీ తరువాయి

డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను స్మరించుకుంటూ రూపొందించిన 'అమరులు వారు' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అమరులకు నివాళి అర్పించిన అనంతరం ప్రసంగించిన సీఎం, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం భావోద్వేగంతో కూడిన రోజని పేర్కొన్నారు. సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను మరువలేమన్నారు. అమరుల కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేరని అయితే వారి కుటుంబాలు ఒంటరివి కావని, తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ, సమాజం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు కోటి రూపాయలు, ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు కోటి 25 లక్షలు, డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు కోటి 50 లక్షల రూపాయలు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయల పరిహారం అందించేలా నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని సీఎం స్పష్టం చేశారు. హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం



అందిస్తున్న ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను పది లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత ముఖ్యమని సీఎం పేర్కొన్నారు.

### మహిళల భద్రతకు ప్రాధాన్యం

పోలీస్ శాఖను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరో ఐదు వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టామని, 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించడం ద్వారా వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రయత్నం చేశామన్నారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పోలీసు సిబ్బంది పిల్లలకు విద్యావకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపి మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు.

### డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ సేవలు భేష్

యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును, డీజీపీని అభినందించారు. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు టీజీ సేఫ్ వ్యవస్థను తీసుకొచ్చామని వెల్లడించారు. మహిళల భద్రతకు షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మరిన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదని సీఎం సూచించారు. మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.

# తాగునీటి కోసం వెయ్యి క్యూసెక్కుల నీటి విడుదల

పాలమూరు-రంగారెడ్డి-నార్లాపూర్ నుంచి ఎల్లూరు జలాశయానికి మంత్రి జూపల్లి కృష్ణారావు నీరు విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 ఏళ్లు కాలయాపన చేసి మతి లేకుండా మాట్లాడుతున్నారని, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు నీటిని ముందుకు తీసుకెళ్లండంటూ బీఆర్ఎస్ నేతలకు జూపల్లి కృష్ణారావు సవాల్? విసిరారు.



### లక్ష ఎకరాలకు అదనంగా నీటిని ఇస్తున్నాం

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని మిషన్ భగీరథ అదనంగా " రా" వాటర్ పంపింగ్ సిస్టంను మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. మిషన్ భగీరథ, పీఆర్ఎల్ఐ, ఎంజీకెఎల్ఐ ప్రాజెక్టుల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. పీఆర్ఎల్ఐ అంజనగిరి రిజర్వాయర్ నుంచి ఎల్లూరు సమీపంలోని ఎంజీకేఎల్ఐ ఎల్లూరు రిజర్వాయర్?కు నీటిని విడుదల చేశారు. 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఎంజీకెఎల్ఐ నుంచి లక్ష ఎకరాలకు అదనంగా నీటిని ఇస్తున్నామని, కల్వకుర్తి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, అచ్చంపేట నియోజకవర్గాలకు తాగు, సాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామని ఆయన అన్నారు. "ఎల్లూరు జలాశయానికి నీరు విడుదల చేశాం. వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఎంజీకెఎల్ఐ నుంచి లక్ష ఎకరాలకు అదనంగా నీటిని ఇస్తున్నాం. కల్వకుర్తి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, అచ్చంపేట్ నియోజకవర్గాలకు తాగు, సాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు లేనిపోని అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు"

### వారి వల్లే రైతులకు నీటి కష్టాలు

నీటిని ముందుకు తీసుకెళ్లండి, 10 ఏళ్లు నిర్లక్ష్యంగా ఉండి ఇప్పుడు తెలివిలేని మాటలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలపై మంత్రి జూపల్లి కృష్ణారావు విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వచ్చాక పనులు ప్రారంభించామని, ఇంకా మూడు నాలుగు నెలలో పనులు పూర్తి అవుతాయని ఆయన స్పష్టం చేశారు. లేనిపోని అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన కాలువ పనులు తమ ప్రభుత్వం వచ్చాకనే ప్రారంభించడం జరిగిందని ఆయన అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన ప్రజలకు రైతులకు నీటి కష్టాలు వచ్చాయని ఆరోపించారు.

## వచ్చే వారం కృష్ణా, గోదావరి యాజమాన్య బోర్డుల సమావేశం




-మొదటిపేజీ తరువాయి

బోర్డు సమావేశాల్లో ప్రస్తావనకు రానున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలకు సంబంధించిన అంశాలు మరోమారు చర్చనీయాంశం కానున్నాయి. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగం, రాష్ట్రాల మధ్య నీటి వాటాలు, ప్రాజెక్టుల అనుమతులు, పరస్పర ఫిర్యాదులపై చర్చించేందుకు ఈ నెలలో రెండు కీలక సమావేశాలు జరగనున్నాయి. ఈ నెల 26వ తేదీన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, 30వ తేదీన గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన అధికారులు, ఇంజనీర్లు పాల్గొననున్నారు. ఇప్పటికే పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశాల్లో జరిగే చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీ అంశం మరోసారి కేఆర్ఎంబీ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాలపై ఇటీవల జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలోనూ ఏకాభిప్రాయం కుదరలేదు. ఈనెల 26న జరిగే బోర్డు సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చ జరగనుంది. రెండు రాష్ట్రాలు తమ వాదనలను బలంగా వినిపించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటి వరకు 66, 34 నిష్పత్తిలోనే పంపకాలు జరగాలని ఏపీ అంటోంది. తెలంగాణ మాత్రం విభేదిస్తోంది. కృష్ణా బేసిన్ అధికంగా ఉన్నందున అందుకు అనుగుణంగా కేటాయింపులు జరగాలని అంటోంది. 70, 30 నిష్పత్తిన కృష్ణా జలాలు వినియోగించుకోవాలని తెలంగాణ కోరుతోంది. రెండు రాష్ట్రాల భిన్న వాదనల నేపథ్యంలో కేఆర్ఎంబీ సమావేశంలో జరగనున్న చర్చ కీలకం కానుంది.

### ఆ అంశాలపై చర్చ జరిగే అవకాశం

ఎల్‌నినో ప్రభావం, వర్షభావ పరిస్థితులు, జలాశయాల్లో కొద్దిపాటి ప్రవాహాల నేపథ్యంలో నీటి నిర్వహణ కీలకంగా మారింది. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉన్న జలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ జలాలను జాగ్రత్తగా వినియోగించుకోవాలని త్రిసభ్య కమిటీ సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తు అవసరాలు, నీటి విడుదలకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరిగే అవకాశం ఉంది. సాగునీటి అవసరాలతోపాటు పట్టణాలు, గ్రామాల తాగునీటి అవసరాలను సమన్వయం చేసుకోవడం కూడా కీలకంగా మారింది. రెండు రాష్ట్రాల నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తి అంశాలపై పరస్పరం అభ్యంతరాలు ఉన్నాయి.

### టెలిమెట్రీల ఏర్పాటుపై

గతంలో కృష్ణా బోర్డుకు ఫిర్యాదులు కూడా చేసుకున్నారు. దాంతో ప్రాజెక్టుల ద్వారా నీటి వినియోగం, ఇతర అభ్యంతరాలు కూడా చర్చకు వచ్చే అవకాశముంది. కృష్ణా, గోదావరి నదులపై నిర్మించిన, నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులకు సంబంధించి రెండు రాష్ట్రాలు ఇప్పటికే బోర్డులకు ఫిర్యాదులు చేశాయి. ప్రాజెక్టుల అనుమతులు, నీటి వినియోగం, నిబంధనల అమలు వంటి అంశాలపై పరస్పరం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. బోర్డు సమావేశాల్లో ఆయా ఫిర్యాదులను ప్రస్తావించి, సంబంధిత అంశాలపై స్పష్టత కోరే అవకాశం ఉంది. ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతుల స్థితి, బోర్డుల పరిధి, రాష్ట్రాలు పాటించాల్సిన మార్గదర్శకాలు వంటి అంశాలపై కూడా సమావేశాల్లో చర్చ జరిగే అవకాశం ఉంది. నదీ జలాల వినియోగాన్ని పర్యవేక్షించేందుకు టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు అంశం కూడా సమావేశాల్లో ప్రస్తావనకు రానుంది. గతంలో కొన్ని చోట్ల ఏర్పాటు చేసినప్పటికీ అందులో కొన్ని సరిగ్గా పనిచేయడం లేదు. వాటి స్థానంలో కొత్తగా ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు మరికొన్ని చోట్ల కూడా ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు ఉన్నాయి. దీంతో నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు అంశంపై కూడా చర్చ జరగనుంది.

### నిధుల అంశంపై చర్చ జరిగే అవకాశం

కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల నిర్వహణ, బడ్జెట్‌కు సంబంధించిన అంశాలు కూడా ప్రస్తావనకు రానున్నాయి. బోర్డులకు రెండు రాష్ట్రాల నుంచి రావాల్సిన నిధుల అంశంపై చర్చ జరగనుంది. ఈనెల 30న జరిగే గోదావరి బోర్డు సమావేశంలో పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్స్ అంశం కూడా ప్రస్తావకు వచ్చే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టు కారణంగా ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు, ముంపు ప్రభావం, సంబంధిత ప్రాంతాలపై పడే పరిణామాలపై గతంలోనే తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. ఆ మేరకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు అథారిటీ గతంలో తెలిపింది. జీఆర్ఎంబీ సమావేశంలో ఆ అంశంపై మరోమారు చర్చ జరిగే అవకాశం ఉంది. వీటితోపాటు రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఇతర అంశాలు కూడా.. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డు సమావేశాల్లో చర్చకు రానున్నాయి.

## ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లకు 25 శాతం సీట్లు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరగా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఢిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను రాష్ట్రం అమలు చేస్తుందని కమిషన్‌కు హామీ ఇచ్చారు.

### వివిధ రాష్ట్రాల్లో అమలు

విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లోని ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను వెనుకబడిన వర్గాల విద్యార్థుల కోసం కేటాయించాలి. వారికి ఉచిత విద్యను అందించాలి. ఈ నిబంధన అమలుకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రవేశాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించడం, ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించడం, లాటరీ పద్ధతి ద్వారా సీట్లను కేటాయించడం, సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం వంటి చర్యలను కోర్టు తప్పనిసరి చేసింది. దీని అమలు పర్యవేక్షణ బాధ్యతను ఎన్?సీపీసీఆర్?కి అప్పగించింది. మహారాష్ట్ర, హర్యానా, ఉత్తర్?ప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఇప్పటికే అవసరమైన విధివిధానాలను రూపొందించి ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి.

### గత ఏడాది నామమాత్రంగా

తెలంగాణలో ఈ చట్టం అమలుకు సంబంధించి గత ఏడాది హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. దీంతో అప్రమత్తమైన విద్యాశాఖ ఈ చట్టాన్ని అమలు చేస్తామని అంగీకరించింది. 2025 జులైలో ప్రభుత్వ పాఠశాలలు లేని 96 ప్రాంతాలకు చెందిన పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేలా, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులు కేవలం ఉత్తర్వులు ఇచ్చి ఊరుకున్నారు. ఆ తర్వాత ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీని ఫలితంగా 2025-26, 2026-27 విద్యా సంవత్సరాల్లో కలిపి కేవలం 180 మంది పిల్లలు మాత్రమే ప్రవేశాలు పొందారని విద్యాశాఖ వర్గాల సమాచారం. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో అధికారులు దీనిపై మరోసారి దృష్టి సారించారు.

# సంపాదకీయం

## దక్షిణాదిలో కాక్రోచ్ ఉద్యమాలకు జీరో క్రేజ్

ఢిల్లీ కేంద్రంగా జాతీయ స్థాయిలో సంచలనం సృష్టిస్తూ, ఉత్తరాది ప్రసార మాధ్యమాల్లో రోజంతా అగ్రస్థానంలో నిలుస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాలు దక్షిణాది రాష్ట్రాలకు వచ్చేసరికి పూర్తిగా నిస్తేజంగా మారాయి. ఢిల్లీ విధుల్లో సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మీమ్‌ల ఆధారంగా సాగుతున్న ఈ వినూత్న పొలిటికల్ ట్రెండ్స్‌ను నేషనల్ మీడియా సర్వస్వంగా భావించి ప్రసారం చేస్తున్నప్పటికీ, దక్షిణాదిలో మాత్రం దీనికి కనీస ఆదరణ కూడా లభించడం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి ప్రధాన దక్షిణ భారత ప్రాంతాల్లో ఈ ఉద్యమం కనీస ప్రభావం చూపలేక చతికిలబడింది. ఇక్కడి స్థానిక మీడియా సంస్థలు అక్కడక్కడ కొన్ని వార్తలు ప్రచురించే ప్రయత్నం చేసినా, సాధారణ ప్రజానీకం, యువత దీనిని ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.ఢిల్లీ , ఉత్తరాదిలోని ప్రధాన నగరాల్లో భారీగా వైరల్ అవుతున్న ఈ ట్రెండ్‌ను దక్షిణాది సమాజం, ముఖ్యంగా ఇక్కడి యువత పూర్తిగా తిరస్కరించడానికి ఇక్కడి ప్రత్యేకమైన సామాజిక, ఆర్థిక పరిస్థితులే ప్రధాన కారణమని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉత్తరాదిలోని రాజకీయ వాతావరణం, అక్కడి నిరుద్యోగ నిరసన తీరుకు, దక్షిణాది యువత ఆలోచనా ధోరణికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంది. కాలక్షేపం కోసమో లేదా సోషల్ మీడియాలో సంచలనం కోసమో చేసే ఉద్యమాల కంటే.. తమ ఉజ్వల భవిష్యత్తు, నైపుణ్యాభివృద్ధి , ఆర్థిక స్వావలంబనే ప్రాథమిక లక్ష్యమని భావించే దక్షిణాది యువత ప్రాగ్మాటిక్ ఆలోచనా విధానమే ఈ కాక్రోచ్ ఉద్యమాలు ఇక్కడ అడుగుపెట్టకుండా నిరోధించింది. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులు సుదీర్ఘకాలంగా సమాచార సాంకేతిక రంగం , తయారీ రంగం, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు , స్టార్టప్ రంగానికి కేంద్రబిందువులుగా ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో యువత తమ దృష్టినంతా కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , కొత్త నైపుణ్యాల అప్‌గ్రేడేషన్ . ఐటీ, గ్లోబల్ పరిశ్రమల్లో అవకాశాల సాధనపైనే నిలుపుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ నిరసనల పేరిట కాలం వృథా చేసుకోవడం కంటే, గ్లోబల్ మార్కెట్‌లో తమ అర్హతలను పెంచుకోవడం మరియు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.దక్షిణాదిలో ప్రాంతీయ రాజకీయ చైతన్యం చాలా బలంగా ఉంటుంది. తమిళనాడులోని ద్రవిడ సిద్ధాంతం, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌లలోని బలమైన స్థానిక ప్రాంతీయ పార్టీలు, శ్రేణుల నిర్మాణం కారణంగా.. బయటి నుంచి దిగుమతి అయ్యే డిజిటల్ పొలిటికల్ సటైర్ ఉద్యమాలకు ఇక్కడ స్వతంత్ర స్పేస్ లభించడం లేదు. క్షేత్రస్థాయి సమస్యలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు మరియు ప్రాజెక్టుల పురోగతిపైనే ఇక్కడి రాజకీయ చర్చలు నడుస్తాయి తప్ప, ఢిల్లీ వీధుల్లో పుట్టుకొచ్చే తాత్కాలిక మీమ్ ట్రెండ్స్ ఇక్కడి ప్రజల మద్దతును పొందలేవు.ఢిల్లీలో పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ ప్రధానంగా ఎక్స్ , ఆన్‌లైన్ నిరసనలకు పరిమితమైన ఒక ట్రెండ్ మాత్రమే. దక్షిణాది యువత డిజిటల్ మాధ్యమాలను విజ్ఞానార్జనకు, గిగ్ ఎకానమీలో అవకాశాలకు, లేదా వినోదానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు తప్ప, తమ భవిష్యత్తును పణంగా పెట్టి అర్థం లేని ఉద్యమాల వెనుక పరిగెత్తడం లేదు. పొరుగున ఉన్న విద్యార్థులు, యువత నైపుణ్య ఆధారిత కోర్సులు, పోటీ పరీక్షల శిక్షణపై దృష్టి సారించడాన్ని ఇక్కడ ప్రాధాన్య అంశంగా చూస్తున్నారు. దక్షిణాదిలో యూత్ ఎందుకు వీటిపై ఆసక్తి చూపడం లేదో పరిశీలిస్తే.. ఇక్కడి యువత ఎప్పుడూ ఖాళీగా ఉండరనే వాస్తవం స్పష్టమవుతుంది. ఐటీ రంగాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, పారిశ్రామిక కారిడార్లు, సాంకేతిక , సేవారంగాలు విస్తరించి ఉన్న దక్షిణ భారతదేశంలో యువత తమ కెరీర్ నిర్మాణమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. గ్లోబల్ కాంపిటీషన్ ఎదుర్కొంటూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తీవ్రంగా శ్రమించే యువతకు, ఇలాంటి ప్రయోగాత్మక, వ్యంగ్య రాజకీయ ఉద్యమాల వైపు దృష్టి పెట్టేందుకు సమయం ఉండదు. కేవలం సోషల్ మీడియాలో రీక్రియేషన్ కోసం చూసి వదిలేయడమే తప్ప, వీటిని సీరియస్‌గా తీసుకునేంత ఖాళీ వాతావరణం ఇక్కడ కనిపించదు.అంతేకాకుండా, దక్షిణ భారతదేశంలోని విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల రాజకీయాల ప్రభావం ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే చాలా తక్కువ. క్యాంపస్‌లలో ప్రత్యక్ష రాజకీయాల ప్రమేయం, యూనివర్సిటీల జోక్యం చాలా వరకు పరిమితంగా ఉంటుంది.విద్యార్థులు చదువు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఉన్నత చదువుల వైపు దృష్టి సారిస్తారే తప్ప, ఇలాంటి నిరసనలు, అరాచక తరహా ఉద్యమాల వైపు ఆకర్షితులు కారు. కాలేజీ రోజుల్లోనే భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత ఉండే దక్షిణాది విద్యార్థులు, భావోద్వేగాల కంటే కెరీర్ నిలదొక్కుకోవడానికే తొలి ప్రాధాన్యత ఇస్తారు.మరోవైపు, దక్షిణాది రాజకీయ సంస్కృతి కూడా పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఇక్కడ ప్రాంతీయ పార్టీల ప్రభావం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆధారిత రాజకీయాలే తప్ప, ఇలాంటి విచిత్రమైన నామకరణాలతో కూడిన ఉద్యమాలు స్థానిక ప్రజలను ఆకట్టుకోలేవు. ఉత్తరాదిలో నిరుద్యోగ నిరాశ నిస్పృహల నుంచి పుట్టుకొచ్చిన కొన్ని వ్యంగ్య ధోరణులు అక్కడ చర్చనీయాంశం కావొచ్చు, కానీ ప్రయోజనాత్మక దృక్పథం కలిగిన దక్షిణ భారతదేశం మాత్రం ఇలాంటి ట్రెండ్స్‌ను ఎప్పుడూ పక్కన పెడుతూ వస్తోంది. మీడియా ఎంతగా హోరెత్తించినా దక్షిణాదిలో కాక్రోచ్ ఉద్యమాలకు జీరో క్రేజ్ దక్కడం వెనుక ఇక్కడి యువత మెచ్యూరిటీ స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం కాలక్షేపం కంటెంట్ కంటే తమ ఉజ్వల భవిష్యత్తు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబనే ముఖ్యమమని భావించే ఇక్కడి యువత ఆలోచనా విధానమే, ఈ ఉద్యమాలను ఇక్కడ కనీస ప్రభావం కూడా చూపకుండా అడ్డుకుంటోంది. ఉత్తరాది మీడియా ఎంత హడావుడి చేసినా, దేశీయ రాజకీయాల్లో ప్రభావం చూపుతుందని ప్రచారం చేసినా, దక్షిణాది ప్రగతిశీల సమాజం దానికి పూర్తిగా దూరంగా నిలిచింది. కేవలం డిజిటల్ సంచలనాల ఆధారంగా నడిచే రాజకీయ ఉద్యమాలకు కాలం చెల్లిందని, ప్రగతి సాధన, ఆర్థిక పురోగతే ఏకైక అజెండా అని దక్షిణాది యువత తమ నిశ్శబ్ద తిరస్కరణ ద్వారా మరోసారి స్పష్టం చేసింది.

# మోదీ మాటల తూటాలపైనే గురి!



మోదీ ప్రభుత్వం అన్యాయాలు, అక్రమాలను ప్రతిఘటిస్తూ..నాటి ఆయన సూచనలను తు.చ తప్పక పాటిస్తున్నది 'సీజేపీ'! అంటే..ఆ పేరిట ఐక్యమైన భారత యువత! నాడు స్వాతంత్ర్యం కోసం ఉద్యమించినట్టే..నేడు ప్రజాస్వామ్యం కోసం సమైక్యంగా ఉద్యమించింది దేశ యువత! శాంతియుతంగా ఉద్యమిస్తున్న వారి అణచివేతకు మోదీ, అమిత్ షా చేపట్టిన అప్రజాస్వామిక చర్యలు..నాడు స్వాతంత్ర్య ఉద్యమకారులపై క్రూర అణచివేతకు పూనుకున్న బ్రిటిష్ పాలకులను గుర్తుచేస్తున్నాయి! పరీక్ష పేపర్ల లీకేజీకి కారకుడైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరినట్టే..13 కోట్ల మంది ఓటర్లను తొలగించిన సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామాను కోరుతూ శాంతియుత నిరసనకు దిగింది యువత!-'ఓటర్ల లిస్టు నుంచి ఒక ఓటరు పేరు తొలగించడమంటే ఒక వ్యక్తి దేహం నుంచి అతని ఆత్మను తొలగించడమే!-నోటీసు ఇవ్వకుండా బతికున్న ఓటరును తొలగించడం రాజ్యాంగ విరుద్ధమే'నని ఉద్ఘాటించారు జస్టిస్ ఉజ్జల్ భుయాన్. నోటీసులు ఇవ్వకపోవడమే కాకుండా, సహ ఈసీలు సుఖ్‌బీర్ సింగ్, వివేక్ జోషిల అభ్యంతరాలను కూడా లెక్కచేయక, చట్టబద్ధంగా మార్చవలసిన 'ఫారమ్ 6-7-8'లను ఏకపక్షంగా మార్చి, 14 శాతం ఓటర్లను తొలగించడం జ్ఞానేశ్ అతి పెద్ద అప్రజాస్వామిక చర్య! ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ రితికా చోప్రా ఏడాదిపాటు పరిశోధించి-'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ద్వారా జ్ఞానేశ్ గుట్టును రట్టు చేయడంతో దేశం ఉలిక్కిపడింది! ఈ కుట్ర గురించి ప్రతిపక్షాలు, సీజేపీ సంధిస్తున్న ఏ ఒక్క ప్రశ్నకూ జవాబు చెప్పలేక, మౌనం వహించడం ద్వారా జ్ఞానేశ్ తప్పులను అంగీకరించకనే అంగీకరించినట్లయ్యింది మోదీ సర్కార్.

అసలీ తప్పుల్ని జ్ఞానేశ్ చేత చేయించింది మోదీ, అమిత్ షాలేనని సీజేపీ సహా బీజేపేయేతర పార్టీలన్నీ ముక్తకంఠంతో చెప్తున్నాయి! ఐనా సరే సదరు ఆరోపణలు అవాస్తవాలను సహేతుకంగా నిరూపించి, ప్రజాస్వామ్యం బతికే ఉన్నదని ప్రజలకు విశ్వాసాన్ని కలిగించాల్సిన మోదీ ప్రభుత్వం-తమను నిలదీసిన ప్రత్యర్థులను కేసులతో, తమ గుట్టును రట్టు చేస్తున్న జర్నలిస్టులను చిత్రహింసలతో, శాంతియుత నిరసనకారులను పోలీసులతోనే కాకుండా ప్రైవేట్ గూండాలతో చితగ్గొట్టిస్తూ..అధికారాన్ని నిలబెట్టుకుంటున్నారు.

కార్పొరేట్ల కోసం పరిశ్రమిస్తున్న తమ పార్టీ, ప్రజాభిమానంతో గద్దెనెక్కడం అసాధ్యమన్న వాస్తవం మోదీ, అమిత్ షాకు తెలుసు! అందుకే రాజ్యాధికారం కోసం పలు మాయోపాయాలను రూపొందించుకున్నది బీజేపీ. ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని అదృశ్యం చేసే అతి పెద్ద కుట్ర ఏమంటే? తమ ఈసీ జ్ఞానేశ్ ద్వారా బీజేపీ వ్యతిరేక ఓట్లను కోట్లలో తొలగించడం-తమ ఈవీఎంల రిగ్గింగ్‌కు తోడ్పడేలా లక్షలాది దొంగఓట్లను చేర్పించడం ద్వారా ఎట్టిపరిస్థితుల్లోనూ, ఎప్పటికీ బీజేపీనే గద్దెనెక్కించే దిశగా ఎన్నికల ప్రక్రియను హైజాక్ చేశారు మోదీ, అమిత్ షా!ఈ ప్రమాదం నుంచి భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు కదనరంగంలో దూకింది సీజేపీ! నాడు మన్‌మోహన్ ప్రభుత్వాన్ని గద్దెదించేదాకా యువతను కదం తొక్కించిన నాటి మోదీ మాటల తూటాలనే నేడు ప్రభుత్వానికి గురిపెట్టింది సీజేపీ! వీరోచిత సీజేపీ వెంటే బీజేపీయేతర పార్టీలన్నీ కదం తొక్కుతున్నాయ్! విజయీభవ సీజేపే! అభీష్ట సిద్ధిరస్తు సీజేపీ!

# రాహుల్ అమెరికన్ ఎత్తుగడలు



నీట్ పరీక్షల అవకతవకలను నిరసిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ జూన్-జూలై నెలల్లో ప్రారంభించిన ఉద్యమానికి అనూహ్యమైన, అపూర్వమైన స్పందన రావడం తెలిసిందే. స్పందించిన వారిలో అత్యధికులు యువతీయువకులు. విద్యాశాఖ మంత్రి రాజీనామాను సాధించడంతో సీజేపీ ప్రతిష్ఠ ఆకాశాన్నంటింది. ఆ వెంటనే వారు స్కూ ల్ ఠీక్ కరో కార్యక్రమాన్ని చేపట్టి, విద్యారంగం పరిస్థితి ఎంత అధ్వానంగా ఉన్నదో వీడియో ఆధారాలతో దేశం ముందుకు తేవడంతో వారి పట్ల గౌరవం మరింత పెరిగింది. ఆ కార్యక్రమం సాగుతుండగానే ఓటర్ల జాబితా సవరణ ఒక కుంభకోణంగా వెల్లడి కావడంతో దానిని సీజేపీ సీరియస్‌గా తీసుకుని యువతను భారీ ఎత్తున కదిలించింది. ఇట్లా వరుసగా జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో వారెక్కడా రాజీపడకపోవడం, తీవ్రమైన పోలీస్ అణచివేతలకు భయపడకపోవడం, మోదీ ప్రభుత్వాన్ని సాహసోపేతంగా ధిక్కరిస్తూ ఉండడంతో యువతరంతోపాటు సమాజానికి కూడా ఒక కొత్త ఆశా కిరణంగా రూపు తీసుకోసాగారు. సరిగ్గా ఇక్కడ మొదలయ్యాయి రాహుల్‌గాంధీ ఎత్తుగడలు. కాక్రోచ్‌లు జరుపుతూ వస్తుండిన కార్యక్రమాలను (స్కూళ్ల సమస్య మినహా) కాంగ్రెస్ కూడా చేసినప్పటికీ అవి ఒక పరిమిత స్థాయిలో రొటీన్‌గా సాగి మిగిలిపోయాయి. అందుకు కారణం కాంగ్రెస్ పట్ల విశ్వాసమన్నది ఎప్పటి నుంచో సన్నగిల్లుతుండటం. ఇటువంటి పరిస్థితుల మధ్య రాహుల్ గాంధీ బృందానికి, దేశ యువతరం కాక్రోచ్‌ల వైపు మళ్లటం, వారి ఆకర్షణ క్రమంగా విస్తరిస్తుండటం సమస్యగా మారింది. దానితో సీజేపీని తమ దారికైనా తెచ్చుకోవాలి, లేదా ఆ సంస్థకు ఏవో ముద్రలు వేసి బదనాం చేయాలనే ఎత్తుగడలు మొదలుపెట్టారు. వారు లొంగి వచ్చే అవకాశాలు కనిపించకపోవడంతో సీజేపీ అనేది బీజేపీకి బీ-టీమ్ అనే ప్రచారాలు మొదలుపెట్టారు. ఆ సంస్థలోని ముఖ్యులు కొందరు లోగడ ఆప్‌లో పని చేసిన వారైనందున 'ఆప్‌కు బీ-టీమ్' అని కూడా అన్నారు. కానీ అవేవీ పనికిరాలేదు. ఆ విధంగా రాహుల్ ఎత్తుగడలు విఫలమయ్యాయి. ఉదాహరణకు సీజేపీ, ఏఐఎస్ఏ చేపట్టిన మొదటి అంశం పరీక్షా పత్రాల లీక్ కాగా, అది ప్రస్తుత బీజేపీ హయాంలోనే గాక లోగడ కాంగ్రెస్ పాలనలోనూ జరిగిందని వారు గుర్తు చేశారు. అదే విధంగా 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమం మొదలుపెట్టినప్పుడు, ప్రభుత్వ పాఠశాలల తీవ్రమైన దుస్థితి కాంగ్రెస్ పాలన రోజుల నుంచి నేటికీ కొనసాగుతున్నదని విమర్శలు చేశారు. ఆందోళనల అణచివేత ఏదో ఒక స్థాయిలో బీజేపీ కన్నా ముందు కూడా కనిపించిందన్నారు. దానితో ఇటీవల ఒక కొత్త ఎత్తు మొదలుపెట్టారు. అది ద్విముఖవ్యూహం. ఏకకాలంలో ఒకవైపు సీజేపీపై ఎవరికో బీ-టీమ్ అనే ప్రచారం చేస్తూ, మరొకవైపు వారిని మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నించడం. ఆ విధంగా ప్రచారమన్నది యథాప్రకారం సాగిస్తూనే, తమ నిరసన కార్యక్రమాలకు సీజేపీని ఆహ్వానించడం మొదలుపెట్టారు. సీజేపీపై అణచివేతలను ఖండించారు. యువతరం తన ఉద్యమాన్ని కొనసాగించాలన్నారు. వారికి తాము మద్దతుగా నిలుస్తామన్నారు. ఇంకా అటువంటివే. తమ గత వారపు నిరసన ప్రదర్శనలో ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరా పాల్గొనడంతో రాహుల్‌కు సీజేపీ విషయమై కూడా కొత్త ఆశలు కలిగాయి. ఆ సంస్థ నాయకత్వానికి రాయబారాలు పంపారు. కానీ ఇవేమీ కూడా కాక్రోచ్ నాయకత్వ వైఖరిని మార్చలేకపోయాయి. మొదట నేహా బోరా తాము కాంగ్రెస్ నిరసనలో పాల్గొనడం సర్ సమస్యకు పరిమితమైనదే తప్ప, ఆ పార్టీతో కలిసే ప్రసక్తి లేదని స్పష్టంచేశారు. ఆ తర్వాత సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే కూడా కాంగ్రెస్ కార్యక్రమంలో బయటి నుంచి ఏకీభవిస్తామని, ఆ పార్టీని వ్యతిరేకించబోమని, అంతేగానీ వారితో కలవబోమన్నారు.

ఈ సంస్థల వైఖరికి స్పష్టమైన కారణాలున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, భారతదేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలకు కాంగ్రెస్ సహా అన్ని పార్టీలదీ బాధ్యత ఉన్నదన్నది ఈ సంస్థల నాయకులు తరచూ ఎత్తిచూపుతున్న విషయం. ఉదాహరణకు సీజేపీ, ఏఐఎస్ఏ చేపట్టిన మొదటి అంశం పరీక్షా పత్రాల లీక్ కాగా, అది ప్రస్తుత బీజేపీ హయాంలోనే గాక లోగడ కాంగ్రెస్ పాలనలోనూ జరిగిందని వారు గుర్తు చేశారు. అదే విధంగా 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమం మొదలుపెట్టినప్పుడు, ప్రభుత్వ పాఠశాలల తీవ్రమైన దుస్థితి కాంగ్రెస్ పాలన రోజుల నుంచి నేటికీ కొనసాగుతున్నదని విమర్శలు చేశారు. ఆందోళనల అణచివేత ఏదో ఒక స్థాయిలో బీజేపీ కన్నా ముందు కూడా కనిపించిందన్నారు.

అటువంటి స్థితిలో వారు కాంగ్రెస్‌తో చేతులు కలిపి పని చేయడం సాధ్యమయ్యేది కాదు. వాంఛనీయం కూడా కాదు. వారు ఆ పని చేసినట్టయితే యువత దృష్టిలో, ప్రజల దృష్టిలో తమ విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉన్నది. స్వయంగా కాంగ్రెస్ తన విశ్వసనీయతను కోల్పోతున్నప్పుడు వారితో కలవకపోవడమే సరైన నిర్ణయం అవుతుంది. అయితే దీప్కే, నేహా బోరా స్వయంగా స్పష్టం చేసినట్టు 'సర్' అనేది సార్వత్రిక సమస్య అయినందున అందుకు పరిమితమై కాంగ్రెస్‌తో సంఘీభావాన్ని చూపడం వరకు పొరపాటు ఉండదు. పోతే, ఈ సంస్థల కార్యక్రమాలు ఈ రెండు, మూడు అంశాలకు పరిమితమైనవి కావు. వారికి దీర్ఘకాలిక ప్రణాళికలున్నాయి.

కాక్రోచ్ జనతా పార్టీ ఒక స్పష్టమైన లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ సామాజిక వేదికగా రూపొందుతుండగా, నేహా బోరా సంస్థ ఒక మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీకి అనుబంధమైనది. కాంగ్రెస్ కూడా మొదటి నుంచి లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్ పార్టీ అయినా, గత 30 ఏండ్లుగా ఆ మార్గం నుంచి దారి మళ్లుతూ వస్తున్నది. కనుక ఈ సంస్థలకు కాంగ్రెస్‌తో మైత్రి అనేది అసంబద్ధ విషయం.

అయినప్పటికీ, చింతచచ్చినా అధికారపు కోరికల పులుపు చావని రాహుల్‌కు వేస్తూ వస్తున్న ఎత్తుగడల్లో ఒకటి, ఇతర ప్రతిపక్షాలను 'మీరు మాతో లేకుంటే బీజేపీతో ఉన్నట్టే, వారికి బీ-టీమ్ అయినట్టే' అని ఆరోపించడం. కానీ ఈ చవకబారు ఎత్తుగడలు పని చేయడం లేదు. కాంగ్రెస్ వాళ్లు ఇదే మాట బీఆర్ఎస్ గురించి కూడా అనడం తెలిసిందే. ఆప్, టీఎంసీ వంటివి కూడా ఈ ప్రచారానికి గురయ్యాయి. ప్రస్తుతం కాక్రోచ్‌లను కాంగ్రెస్ లక్ష్యం చేసుకున్నారు. తమ అధికారం కోసం వారిని కబలించాలన్నది ఎత్తుగడ. రాహుల్ గాంధీ ప్రదర్శిస్తున్న ఇటువంటి అసమర్థ దుర్జనత్వ ఎత్తుగడలు కూడా 'ఇండి' కూటమి గందరగోళానికి ఒక ముఖ్య కారణం. సీజేపీ విషయానికి వస్తే, ఆ సంస్థపై ఈ తరహా కుయుక్తుల వల్ల తాము యువతరానికి, సమాజానికి మరింత దూరం కాగలమనే వివేకం రాహుల్ గాంధీకి కలుగడంలేదు.

# చిల్కానగర్ సీనియర్ సిటిజన్స్ నూతన కార్యాలయం ప్రారంభం..





**వృద్ధుల కోసం వెయ్యి గజాల స్థలం కేటాయించాలి..**

**కేబీఆర్ పార్క్ తరహాలో భారీ పార్కు ఏర్పాటు చేయాలి..**

**చిల్కానగర్,అక్టోబర్21(సూర్యరేఖ)** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని చిల్కానగర్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి108 మంది సభ్యులు హాజరై విజయవంతం చేశారు.ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర నాయకులు వెంకటయ్యగౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ప్రేమ్ కుమార్ గౌడ్,ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మగాని దాసుగౌడ్ మాట్లాడుతూ... చిల్కానగర్ ప్రాంతంలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.వృద్ధుల కోసం శాశ్వత సంఘ భవనం,డేకేర్ సెంటర్,గ్రంథాలయం, యోగా కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. రోజురోజుకూ వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి సదుపాయాలు అత్యవసరమని పేర్కొన్నారు.అలాగే ఉప్పల్, మల్లాపూర్,నాచారం,చిల్కానగర్ ప్రాంతాల్లో జనసాంద్రతతో పాటు వాయు కాలుష్యం కూడా పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.వృద్ధులు, చిన్నారులు ప్రశాంత వాతావరణంలో స్వచ్ఛమైన గాలిని పీల్చుకునేందుకు తగిన పార్కులు అందుబాటులో లేవని తెలిపారు.ప్రభుత్వం మూతపడిన అనారోగ్య పరిశ్రమల (సిక్ ఇండస్ట్రీస్) భూములను తిరిగి స్వాధీనం చేసుకుని, హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ తరహాలో ఈ ప్రాంతంలో భారీ పార్కును ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి,స్థానిక ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.పండుగ పనుల బిజీలోనూ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసిన 108మంది సభ్యులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు, కార్యవర్గ సభ్యులు,పాలకవర్గ సభ్యులు,ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో అంబరాన్ని అంటిన దసరా సంబరాలు..





**పల్లె వాతావరణం ఉట్టిపడేలా దసరా ఉత్సవాలు**

**భారీగా తరలివచ్చిన పట్టణ ప్రజలు**

**పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

**ఉప్పల్,అక్టోబర్21(సూర్యరేఖ)** ఉప్పల్ దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా,ఉత్సాహభరితంగా జరిగాయి.ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో దసరా ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి,వజ్రేష్ యాదవ్, భూపతి రెడ్డి నర్సిరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా జమ్మిపూజ,రావణ దహనం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాలు పల్లె వాతావరణాన్ని తలపించేలా ఉండటంతో పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ పట్టణ పెద్దలు,ప్రముఖులు కందికంటి అశోక్ కుమార్ గౌడ్,సల్ల రాజిరెడ్డి , బొమ్మగోని దాస్ గౌడ్,పాశికంటి నాగరాజు,బజార్ జగన్నాథ్ గౌడ్,బాకారం లక్ష్మణ్,బజారు పాండు గౌడ్, చెన్నారెడ్డి రఘుపతిరెడ్డి,తెల్కల మోహన్ రెడ్డి,ఈగ అంజయ్య ముదిరాజ్,లింగంపల్లి రామకృష్ణ,బజారు రామరాజ్ గౌడ్,పూజాల ప్రభాకర్,రంగనాథ్ గౌడ్, బూసం రఘునాథ్ రెడ్డి,సుంకు శేఖర్ రెడ్డి,ఈగ సంతోష్ ముదిరాజ్,సల్ల ప్రభాకర్ రెడ్డి,ఆగం రెడ్డి, గొరిగె ఐలయ్య,దేవిరెడ్డి,మంద మురళీకృష్ణరెడ్డి, గొరిగె నాగేష్,వర్కల మదన్,రామ్ రెడ్డి తదితరులు, అలాగే ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.దసరా ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించడంతో ఉప్పల్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది .ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొని వేడుకలను ఆస్వాదించారు.

# ధ్యానమనోప్రస్థానం నందు ఘనంగా విజయదశమి వేడుకలు..

**శివంపేట,అక్టోబర్ 21(సూర్య రేఖ):** శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి వారి దివ్య ఆశీస్సులతో ధ్యానమనోప్రస్థానమ్ బండ్లగూడ జాగీర్ హైద్రాబాద్ నందు విజయ దశమి దసరా వేడుకలు 20అక్టోబర్ మంగళవారం ఘనంగా నిర్వహించడం జరిగింది.ముఖ్యఅతిథులుగా డాక్టర్ గౌరీశంకర్, డాక్టర్ వి.శేషగిరి,ఫార్మర్ ఇస్రో అసోసియేట్ డైరెక్టర్, డాక్టర్ లక్ష్మీనారాయణ,లు మాట్లాడుతూ...దసరా శుభాకాంక్షలతో పాటు దసరా యొక్క ప్రత్యేకత వివరించారు.భూగోళ అష్టదిక్కులలోనూ, అష్టవిధాలుగా,ఆక్టోపస్ అష్టరీతులుగ, మానవ ద్వంద్వ జీవితంలోని శిష్టతను,బాధిస్తూ వేధిస్తున్న దుష్టతపై అష్టదినాలు పోరుసాగించి,విజయాన్ని సాధించిన 'నవశక్తి' పేర,దశమి దసరా వేడుకలు జరుపుకోవడం,ఆచారం.దీనిని ఆదర్శంగా తీసుకుని, మనిషి,తన జీవిత ద్వంద్వానిలోని, చెడును తొలగించి,మంచిని పెంచుకునే ప్రయత్నం,జీవిత ప్రయోజనం..కార్యక్రమంలో భాగంగా గురువు సూచించిన ప్రస్థాన ధ్యానం--ఆసన,ప్రాణాయామ ధ్యానము నిర్వహించారు.అర్హులైన పేదలకు ఉచిత వైద్య శిబిరం,పేద విద్యార్థులకు సైకిళ్లు.పేదలకు వస్త్ర బహూకరణ,అనంతరం దాదాపు 900మంది భక్తులు కార్యక్రమానికి హాజరైన వారందరూ గురువుగారి దివ్య ఆశీస్సులు తీసుకొని



మహా ప్రసాదం స్వీకరించారు. మానవ జీవితం,మహనీయతను కలిగి వుంది. మమత, ఆత్మీయత,ఆప్యాయత కలిసిన మానవత్వం,జీవిత మాన్యతకు ప్రేరణ..భావం, భాషతో పాటు విషయజ్ఞానం,ఆత్మజ్ఞాన స్ఫూర్తి కూడ ప్రత్యేకమే సుమా..జీవితం ఒక్కసారే వస్తుంది, ఇంకేమీ కాదు.కాబట్టి దానిని సరిగ్గా మరియు సమృద్ధిగా ఉపయోగించుకోండి.మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి మరియు ఇతరులను ఇష్టపడండి. జీవితం అబద్ధం కాదు,వట్టిది కాదు.సరళమైన జీవితానికి ధ్యాన ప్రస్థాన్ ద్వారా సాధించబడిన స్పష్టమైన మనస్సు అవసరం.

## పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం..

**అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం,పోలీసు శాఖ అండగా ఉంటాయి..**

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి,అక్టోబర్21(సూర్యరేఖ)** విధి నిర్వహణలో దేశరక్షణ,అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి స్ఫూర్తి,విలువలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం(పోలీసు ఫ్లాగ్ డే)సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్రతో కలిసి కలెక్టర్ పుష్పగుచ్ఛాలు సమర్పించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు,సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...సమాజ అభివృద్ధి,సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందాలంటే శాంతిభద్రతల పరిరక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.దేశ సరిహద్దుల్లో సైనికులు,దేశ అంతర్గత భద్రతలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు.విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని,వారు చూపిన ధైర్యం, కర్తవ్యనిష్ఠ,సేవాభావాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.కామారెడ్డి జిల్లా నుంచి ఇప్పటివరకు ఏడుగురు పోలీసు అధికారులు,సిబ్బంది విధి నిర్వహణలో అమరులయ్యారని గుర్తుచేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**గడ్డం వినోద్ వెంకటస్వామి**





**బెల్లంపల్లి,అక్టోబర్21(సూర్యరేఖ)** బెల్లంపల్లి నియోజకవర్గం బెల్లంపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ,వాహన పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి నియోజకవర్గ ప్రజలకు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు.ఈ పర్వదినం ప్రతి ఇంటా ఆనందం,ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్,మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్,వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ,కాంగ్రెస్ నాయకుడు శ్యామ్,తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## హబ్సీగూడలో వైభవంగా రావణ దహనం..

**ముఖ్యఅతిథిగా విచ్చేసిన హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ రెడ్డి,పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు**



**హబ్సిగూడ,అక్టోబర్21 (సూర్యరేఖ)** దసరా పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి హబ్సీగూడ స్ట్రీట్ నంబర్1లోని శ్రీమహంకాళి రామ మందిరంలో రావణ దహనం వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కంది శ్రవణ్ కుమార్ రెడ్డి హాజరై రావణ దహనం కార్యక్రమాన్ని ఆద్యంతం తిలకించారు.ఆలయ కమిటీ సభ్యులు ఆనవాయితీ ప్రకారం భక్తిశ్రద్ధలతో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రావణ దహన కార్యక్రమం వైభవంగా చేపట్టారు.చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈరావణ దహన వేడుకను తిలకించడానికి డివిజన్ వాసులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.కార్యక్రమంలో రామాలయం చైర్మన్, ఏ బ్లాక్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చింతల బాబురావు , రామాలయం ధర్మకర్త విపిన్ అగర్వాల్,ధర్మరాజు, సాయి కుమార్,మేకల శివ,ఖలేమ్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్ రెడ్డినగర్ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా రంగు శేఖర్ గౌడ్ నియామకం..

**తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపిన రంగు శేఖర్ గౌడ్**



**వెంకట్ రెడ్డినగర్,అక్టోబర్21(సూర్యరేఖ)** వెంకట్ రెడ్డినగర్ డివిజన్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా రంగు శేఖర్ గౌడ్‌ను నియమించిన తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు రంగు శేఖర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకం ఉంచి డివిజన్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు ఆమెకు ధన్యవాదాలు తెలియజేశారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని రంగు శేఖర్ గౌడ్ తెలిపారు.డివిజన్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.పార్టీ నాయకులు,కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు,తనకు అండగా నిలిచిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# భక్తిశ్రద్ధలతో పోచమ్మ మైసమ్మ అమ్మవార్లకు పూజలు..

**బిఆర్ఎస్ నాయకులు మంద భవానిజగన్**



**సికింద్రాబాద్,అక్టోబర్21(సూర్యరేఖ)** అంబానగర్ డివిజన్ పరిధిలోని పోచమ్మ మైసమ్మ దేవాలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు మెంబర్,సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు,ఎస్సి, ఎస్టి,బిసి మైనారిటి సెల్ ప్రెసిడెంట్ మంద జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రజలందరికి అమ్మవారి ఆశీస్సుల ఎల్లప్పుడూ ఉండాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో అంబానగర్ అధ్యక్షులు కొండ కిషోర్ గౌడ్,ఉపాధ్యక్షులు మంద భవాని,మురళి, సముద్రాల యాదగిరి,దిండిగల శ్రీకాంత్,శ్రీను, సముద్రాల రాజు,మాజీ బిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి,శ్రీను,రాజుగౌడ్,వల్లపు మురళి,వైట్ల వెంకటాద్రి,ఆమంచ మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

# దాతృత్వం చాటుకున్న మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటి

**బాధితుల కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం..**



**ఖమ్మం, అక్టోబర్21 (సూర్యరేఖ)** పురపరిధిలో శాంతినగర్‌కు చెందిన ఖమ్మంపాటి నరసింహారావు,గండు సత్యం కుటుంబాలకు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులు సండ్ర వెంకటవీరయ్య ప్రధాన అనుచరులు మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు రూ,10వేలు ఆర్థిక సహాయం అందజేసే ఆయన దాతృత్వాన్ని చాటుకున్నారు.

**వివరాలు ఇలా ఉన్నాయి..**

ఇటీవల కాలంలో గోపాలకుంటలో ఒక ఇంటి పని చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా కర్ర విరిగి కింద పడటంతో వారిద్దరికీ రెండు కాళ్లు విరగడం జరిగింది. నిరు పేదరికంలో ఉండి ఇబ్బందులు పడుతూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. పనిచేస్తేనే కుటుంబశీ గడిచే పరిస్థితులు,కుటుంబ యజమాని మూలనపడటంతో వారు పడుతున్న ఇబ్బందులను గురించి తెలుసుకున్న మాజీ వార్డు సభ్యులు వెంకట్ నేరుగా వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి వారి యోగ క్షేమాలు క్షుణ్ణంగా అడిగి తెలుసుకొని బాధితులకు మనో ధైర్యాన్ని నింపి మీకు నేను ఉన్నానంటూ ముందుకు వచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.ఇదిలా ఉండగా గతంలో తాను కూడా ఇలా ఇబ్బందులు పడి ఆరు నెలలు మంచం మీద ఉన్నానని ఆ పరిస్థితి ఏ విధంగా ఉంటుందో నాకు తెలుసు అని అన్నారు.వారిని ఆదుకునేందుకు తన వంతు సహాయముగా ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ,10వేలు ఆర్థిక సాయం అందించారు. వారి ఆరోగ్యం కుదుటపడి త్వరగా కోలుకొని క్షేమంగా ఉండాలని భగవంతుని కోరుకుంటున్నాను అని తెలిపారు.ఈ సందర్భంగా వారి కుటుంబానికి తగినంత సహాయం చేసి ప్రతి ఒక్కరు వారి కుటుంబాలకు అండగా ఉండాలని కోరుతూ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు ఖమ్మంపాటి పుల్లారావు, మోదుగు రమేష్ తేల్లపుట్ట శ్రీనివాసరావు,కొత్తపల్లి వంశీ పలువురు పాల్గొన్నారు.

# వెంకట్ రెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల నియామకం..

**కాలనీ అభివృద్ధి,సంక్షేమానికి సమష్టిగా కృషి చేయాలి:**

**అధ్యక్షుడు గడ్డం సాయికిరణ్**

**వెంకట్ రెడ్డినగర్,అక్టోబర్ 21(సూర్యరేఖ)** వెంకట్ రెడ్డినగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధి, సంక్షేమం,ప్రజోపయోగ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు నూతన అదనపుకార్యవర్గ సభ్యులను నియమించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం సాయికిరణ్ ఆమోదంతో ఈ నియామక ఉత్తర్వులను అక్టోబర్ 21న జారీ చేశారు.నూతన నియామకాల ప్రకారం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూజారి సోమ్మయ్య,ప్రధాన కార్యదర్శిగా పీసరి శంకర్,ఉపాధ్యక్షులుగా బిల్లకంటి వెంకటేష్,వినయ్ కుమార్ గౌడ్,కోశాధికారిగా ఎండపల్లి సుదర్శన్ రెడ్డి,కార్యదర్శిగా వంపు లక్ష్మయ్య,సహకార్యదర్శిగా యాదమ్మ నియమితులయ్యారు.వీరి నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు.నూతన కార్యవర్గ సభ్యులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ,కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధ్యక్షుడు గడ్డం సాయికిరణ్ ఆకాంక్షించారు.వెంకట్ రెడ్డి నగర్‌ను ఆదర్శవంతమైన మోడల్ కాలనీగా తీర్చిదిద్దేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

# మెట్టుగూడ క్యాథలిక్ స్మశాన వాటిక అభివృద్ధికి ర్యాల రాజేందర్ యాదవ్ చొరవ..



**సికింద్రాబాద్,అక్టోబర్21(సూర్యరేఖ)** సికింద్రాబాద్ మెట్టుగూడ సెయింట్ ఆంథోనీస్ ష్రైన్‌కు చెందిన క్యాథలిక్ స్మశాన వాటికలో పిచ్చి మొక్కలు పెరిగి,వీధి దీపాల స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో అభివృద్ధి పనులు చేపట్టాలని కమిటీ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ర్యాల రాజేందర్ యాదవ్‌ను కోరారు. స్పందించిన ఆయన జీహెచ్ఎంసీ డీఈ హేమునాయక్‌కు ఫోన్ ద్వారా సమస్యలను వివరించారు.స్మశాన వాటికలో కాంపౌండ్ గోడలు,ప్రపంచ యుద్ధం మరియు బ్రిటిష్ సమాధులకు సున్నం వేయడం,నవంబర్ 1,2తేదీల్లో లైటింగ్ ఏర్పాటు చేయడం,అంతర్గత రహదారులను శుభ్రం చేయడం,శిథిలాలను తొలగించడం, అవసరమైన చోట కొత్త వీధి దీపాల స్తంభాలను ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ...స్మశాన వాటిక మన పూర్వీకుల పవిత్ర స్థలమని,దాని పవిత్రతను కాపాడుకోవడం ప్రతి విశ్వాసి బాధ్యత అని పేర్కొన్నారు.నవంబర్ 1, 2తేదీల్లో శ్రమదానం ద్వారా స్మశాన వాటికను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.విశ్వాసులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పీటర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రతివిరాజ్,తదితరులు పాల్గొన్నారు.

# స్టేటస్‌లు పెరుగుతున్నాయ్..అనుబంధాలు తగ్గుతున్నాయ్.!

**స్మార్ట్‌ఫోన్ మాయలో మానవ సంబంధాలు..**

**కుటుంబాల్లో తగ్గుతున్న ఆప్యాయతలు..**



**చెన్నూర్,అక్టోబర్21(సూర్యరేఖ)** నేటి ఆధునిక యుగంలో స్మార్ట్‌ఫోన్ మనిషి జీవితంలో విడదీయలేని భాగంగా మారింది. సమాచార మార్పిడి నుంచి వినోదం వరకు ప్రతి అవసరానికి ఫోన్‌పైనే ఆధారపడుతున్నారు. అయితే సాంకేతికత అందిస్తున్న సౌకర్యాల మధ్య మనుషుల మధ్య ప్రత్యక్ష సంభాషణలు,ఆత్మీయ పలకరింపులు తగ్గుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.ఒకప్పుడు కుటుంబ సభ్యులంతా కలిసి కూర్చొని కష్టసుఖాలు పంచుకునేవారు.బంధువుల ఇళ్లకు వెళ్లి పలకరించేవారు.పండుగలు,శుభకార్యాలు కుటుంబాలను ఒక్కచోట చేర్చేవి.ప్రస్తుతం అనేక సందర్భాల్లో ప్రత్యక్ష పలకరింపుల స్థానంలో ఫోన్ సందేశాలు, సోషల్ మీడియా శుభాకాంక్షలు ప్రాధాన్యం పొందుతున్నాయి.

**ఒకే ఇంట్లో..వేర్వేరు ప్రపంచాలు**

ఇంట్లో కుటుంబ సభ్యులు పక్కపక్కనే ఉన్నప్పటికీ ఒక్కొక్కరు తమ ఫోన్‌లో నిమగ్నమవుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.పిల్లలతో మాట్లాడటం, పెద్దల యోగక్షేమాలు తెలుసుకోవడం,కుటుంబంతో కలిసి సమయం గడపడం వంటి అలవాట్లకు తగినంత సమయం కేటాయించకపోవడం ఆందోళన కలిగించే అంశం.

**సోషల్ మీడియాలో పరిచయాలు..నిజ జీవితంలో దూరాలు**

వాట్సాప్, ఫేస్‌బుక్,ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల ద్వారా పరిచయాలు పెరుగుతున్నాయి.అయితే ఆ పరిచయాలన్నీ ఆత్మీయ బంధాలుగా మారడం లేదు. సంతోషాలను ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నా, కష్టసమయాల్లో ప్రత్యక్షంగా అండగా నిలిచే బంధాల విలువను గుర్తించడం అవసరం.

**మార్పు మన చేతుల్లోనే..**

సాంకేతికతను పూర్తిగా దూరం పెట్టడం పరిష్కారం కాదు.దానిని అవసరానికి అనుగుణంగా వినియోగించుకుంటూ కుటుంబ సభ్యులకు సమయం కేటాయించడం ముఖ్యం.భోజన సమయంలో ఫోన్లను పక్కన పెట్టడం, పిల్లలతో మాట్లాడటం,పెద్దలను పలకరించడం,బంధువులను ప్రత్యక్షంగా కలవడం వంటి చిన్న మార్పులు అనుబంధాలను బలోపేతం చేస్తాయి.

**ముగింపు..**

స్టేటస్‌ల ద్వారా మన భావాలను ప్రపంచానికి తెలియజేయడం కంటే,మన పక్కనున్న వారి భావాలను అర్థం చేసుకోవడం ముఖ్యం.సాంకేతికత మనుషులను కలపాలి కానీ వారి మధ్య దూరాన్ని పెంచకూడదు.ఫోన్ వినియోగంతో పాటు మానవ సంబంధాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చినప్పుడే కుటుంబాల్లో ఆప్యాయతలు,సమాజంలో అనుబంధాలు నిలుస్తాయి.

# భక్తిశ్రద్ధలతో దసరా పూజలు..

**బిఆర్ఎస్ నాయకులు-మంద జగన్**



**సికింద్రాబాద్,అక్టోబర్21(సూర్యరేఖ)** సికింద్రాబాద్ పద్మశాలి సంఘం ఆర్గనైజర్ తౌటం సతీష్ ఆధ్వర్యంలో దసరా పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సంఘం అధ్యక్షులు, ఉద్యమకారులు, సికింద్రాబాద్ ఎస్సీ,ఎస్టీ, బీసీ,మైనారిటీ సెల్ అధ్యక్షులు మంద జగన్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు.దసరా పండుగను పురస్కరించుకొని సంఘ సభ్యులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రజలందరికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ..చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటామని,ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కర్నాటి ఆనంద్ కుమార్,తౌటం సతీష్,దిండిగల శ్రీకాంత్,తిరుమల రవి,పులి శివ తదితరులు పాల్గొన్నారు.

# పద్మారావుగౌడ్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన జీఎస్ఆర్ టిమ్



**సికింద్రాబాద్,అక్టోబర్21(సూర్యరేఖ)** విజయదశమి సందర్భంగా జి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని జీఎస్ఆర్ టీం సభ్యులు మాజీ డిప్యూటీ స్పీకర్,సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు మిఠాయిలు అందజేసి,ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగ జరు పుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకులు మరిపల్లి రవి,నవీన్ చారి, సయ్యద్ సద్దాం,వినోద్ కుమార్,కార్యకర్తలు పాల్గొన్నారు

# బాపునగర్లో అమ్మవారికి న్యాయమూర్తి దంపతుల ప్రత్యేక పూజలు..



**అమీర్ పేట,అక్టోబర్ 21(సూర్యరేఖ)** అమీర్ పేట డివిజన్ లోని బాపునగర్ సేవా భయా సేవా సంఘ్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఉత్సవాల్లో భాగంగా న్యాయమూర్తి కిరణ్,సరిత దంపతులు వేడుకలకు హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు.అనంతరం తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు స్వీకరించారు.అదే విధంగా టీజీ జెన్కో డిప్యూటీ సెక్రెటరీ శైలేందర్ సింగ్ కూడా వేడుకలకు హాజరయ్యారు.అమ్మవారికి పూజలు జరిపించి ప్రజాసంక్షేమం కోసం ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పి. చరణ్ సింగ్,కునాల్ రాథోడ్,రాజ్ కుమార్ జాదవ్, విశాల్ సింగ్,మనోజ్ రాథోడ్,జతిన్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వీరబ్రహ్మేంద్రనగర్ లో అంబరాన్ని అంటిన దసరా సంబరాలు..

**కుంకుమ పూజ మరియు హోమం,మహాఅన్నదాన కార్యక్రమం..**

**భారీగా తరలివచ్చిన కల్లూరు మండల నాయకులు**



**ఖమ్మం,అక్టోబర్21(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవీరబ్రహ్మేంద్ర నగరంలో దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా,ఉత్సాహభరితంగా జరిగాయి.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్,కాంగ్రెస్ మండల నాయకులు,తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.తదుపరి అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని చండీ హోమం కార్యక్రమం తిలకించినారు.వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు,పసుమర్తి చందర్రావు, లక్కినేని కృష్ణ,ఏనుగు సత్యంబాబు, యువనాయకులు ఆళ్లకుంట నరసింహారావు,పెద్ద బోయిన శ్రీనివాసరావు,తోట సుబ్బారావు,నోటి కృష్ణారెడ్డి,పరిమి భరత్,మట్ట రామకృష్ణ,ఆలయ ప్రధాన అర్చకులు శివనాథచార్యులు,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దసరా పూజలు..

బిఆర్ఎస్ నాయకులు మంద భవానిజగన్



**సికింద్రాబాద్,అక్టోబర్21 (సూర్యరేఖ)** సికింద్రాబాద్ పద్మశాలి సంఘం ఆర్గనైజర్ పులి శివకుమార్ ఆధ్వర్యంలో దసరా పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సంఘం అధ్యక్షులు,ఉద్యమకారులు, ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు మంద జగన్ ముఖ్య అతిథిగాపాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దసరా పండుగను పురస్కరించుకొని సంఘ సభ్యులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రజలందరికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటామని,ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు,అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్,ఒగ్గ శ్రీధర్,కర్నాటి ఆనంద్ కుమార్,తౌటం సతీష్,తిరుమల సంతోష్,దిండిగల శ్రీకాంత్,తిరుమల రవి,తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో ఘనంగా రావణ సంహార మేళా..

ముఖ్యఅతిథిగా పాల్గొని రావణ దహనం చేసిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



**రామంతాపూర్,అక్టోబర్21(సూర్యరేఖ)** దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామంతాపూర్ దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రావణ సంహార మేళాను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరై రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు,నాయకులు,కార్యకర్తలు పాల్గొని ఉత్సవాలను తిలకించారు.ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ...విజయదశమి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు.రావణ దహనం ద్వారా అధర్మంపై ధర్మం, చెడుపై మంచి ఎప్పటికైనా విజయం సాధిస్తాయనే సందేశం ప్రజలకు అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముడి ఆదర్శాలను ఆచరిస్తూ సత్యం, ధర్మం,న్యాయం పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.ఇలాంటి పండుగలు ప్రజల్లో ఐక్యత, సోదరభావం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ చైర్మన్ బుర్ర రాజేశ్వర్,వైస్ చైర్మన్ ముత్తినేని జగదీష్,అధ్యక్షుడు వల్లపు జగన్ యాదవ్,ప్రధాన కార్యదర్శి తాళ్ల బాలకృష్ణ గౌడ్,కోశాధికారి ఇటికల వెంకటేష్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా,తదితర స్థానిక నాయకులు,కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీమంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన వినోద్ కుమార్



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్21(సూర్యరేఖ)**చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పవిత్రమైన పండుగ విజయ దశమిని పురస్కరించుకొని భారత రాష్ట్ర సమితి పార్టీ జియాగూడ డివిజన్ సీనియర్ నాయకులు కే.ఎన్.వినోద్ కుమార్ కటిక్ మాజీమంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను వారి నివాస ప్రాంగణంలో మర్యాదపూర్వకంగా కలసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శ్రీరాముడు రావణుడిని వధించడం,అమ్మవారు మహిషాసురుడిని సంహరించడం పర్వదిన విశిష్టత అని పేర్కొన్నారు.చెడు ఎంత శక్తివంతమైనదైనా చివరికి సత్యం, ధర్మమే గెలుస్తుందని ఈ పండుగ మనకు గుర్తుచేస్తుందని వారు వివరించారు.

## ప్రజలతో కలిసి అలయ్-బలయ్ వేడుకల్లో పాల్గొన్న జీఎంఆర్

ప్రజలతో ఆత్మీయ కలయిక..విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన గుఱ్ఱపు మచ్చేందర్






**నారాయణఖేడ్,అక్టోబర్21(సూర్యరేఖ)** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన అలయ్-బలయ్ వేడుకల్లో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్ పాల్గొని ప్రజలతో పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ,అందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా ప్రజలతో కలిసి ఆనందంగా గడుపుతూ ఆత్మీయతను చాటుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అలయ్-బలయ్ కార్యక్రమం ప్రజల మధ్య సోదరభావం,ఐక్యత, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు రాజకీయాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకచోట చేర్చి ఆత్మీయ సంబంధాలను బలోపేతం చేస్తాయని తెలిపారు.పండుగల అసలైన ఆనందం అందరితో కలిసి సంతోషాలను పంచుకోవడంలోనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుఱ్ఱపు మచ్చేందర్ మాట్లాడుతూ... విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆశలు, విజయాలు,సుఖసంతోషాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, రైతులు,యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని కోరుకున్నారు.ప్రజల మధ్య ఐకమత్యం, సోదరభావం ఎల్లప్పుడూ కొనసాగాలని,ప్రతి ఒక్కరూ ప్రేమాభిమానాలతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు.ప్రజలతో మమేకమై పండుగ వేడుకల్లో పాల్గొన్న ఆయన,నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ దసరా పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, అందరి జీవితాల్లో శాంతి,సౌభాగ్యం వెల్లివిరియాలని కోరుకున్నారు.

## మాజీ ఎమ్మెల్సీ,కేసీఆర్ రాజకీయ సలహాదారులు శేరి సుభాష్ రెడ్డికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన గున్నాల రంగారెడ్డి కుటుంభం



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్21(సూర్యరేఖ)** భారత రాష్ట్ర సమితి పార్టీ సీనియర్ నాయకులు,మాజీ ఎమ్మెల్సీ,కేసీఆర్ రాజకీయ సలహాదారులు శేరి సుభాష్ రెడ్డిని వారి వ్యవసాయ క్షేత్రంలో కార్వాన్ నియోజక వర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలసి దసరా పర్వదినంను పురస్కరించుకొని విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గున్నాల రంగారెడ్డి మాట్లాడుతూ...ప్రస్తుత,రాబోయే కాలంలో జరుగబోయే రాజకీయ పరిణామాల మార్పులపై చర్చించడం జరిగిందన్నారు.తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించిన తర్వాత దసరా పండుగ ను ఘనంగా జరుపుకుంటామని అన్నారు.చెడు ఎంత శక్తివంతమైనదైనా, చివరికి సత్యం మరియు ధర్మమే గెలుస్తుందని ఈ పండుగ మనకు గుర్తుచేస్తుందని తెలిపారు.మనలోని కోపం,అసూయ,స్వార్థం వంటి దుర్గుణాలను అణచివేసి,సద్గుణాలతో ముందుకు సాగడమే ఈ పండుగ అసలు పరమార్ధం అని ఆయన వివరించారు.ఈ శేరి సుభాష్ రెడ్డిని కలిసినవారిలో సి.హెచ్.చంద్రశేఖర్ రెడ్డి,సి.హెచ్.నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు



**ఉప్పల్,అక్టోబర్21(సూర్యరేఖ)** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్)కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.విజయదశమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు, అభివృద్ధి, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించారు.దసరా పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల మధ్య పండుగ శుభాకాంక్షల మార్పిడి జరిగింది.

## వెంకట్ రెడ్డినగర్‌లో ఘనంగా దసరా ఉత్సవాలు..

ఆకట్టుకున్న ఆయుధ పూజ, జమ్మి చెట్టు పూజ, పాలపిట్ట దర్శనం,రావణ దహనం





**వెంకట్ రెడ్డినగర్,అక్టోబర్21(సూర్యరేఖ)** వెంకట్ రెడ్డినగర్‌లో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ఆయుధ పూజ,జమ్మి చెట్టుపూజ,పాలపిట్ట దర్శనం,రావణ దహనం కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు కాలనీవాసులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు.దసరా పండుగ ప్రాముఖ్యతను చాటిచెబుతూ సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు,రావణ దహనం వేడుకలు ప్రజలను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ...దసరా ఉత్సవాలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వెంకట్ రెడ్డినగర్ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ప్రతి ఏటా నిర్వహించే ఈ వేడుకలకు భవిష్యత్తులోనూ కాలనీవాసులు ఇదే విధంగా సహకరించాలని కోరారు.

## శ్రీవాసవి కన్యకపరమేశ్వరి దేవాలయంలో వైభవంగా దేవినవరాత్రి ఉత్సవాలు ..



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 21(సూర్యరేఖ)** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ హుడా కాలనీలోని శ్రీవాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో దేవినవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.దసరా పర్వదినం పురస్కరించుకొని శమీ పూజలుచేసిన సుమారు 500భక్తులకు శ్రీరాజా రాజేశ్వరిదేవి దర్శనమిచ్చారు.పోలా సాయిబాబు దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు.ఫౌండర్ చైర్మన్ పోలా కోటేశ్వరరావు-వాణి దంపతులు ప్రతిరోజు ఉదయం అభిషేకం కుంకుమ పూజ , బతుకమ్మ హోమం,శమి పూజలో పాల్గొన్నారు. దేవాలయ సభ్యులు ఉషరాణి,శ్రీకాంత్,వినయ్, మారం వెంకట్,రాము,కట్కూరి శ్రీనివాస్, శేరిలింగంపల్లి ఆర్యవైశ్య సభ్యులు అధిక సంఖ్యలో పూజలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులైనారు.

### గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని మహిళ దుర్మరణం

**రాజేంద్రనగర్,అక్టోబరు21** బుధవారం తెల్లవారుజామున 3.30గంటలకు పీవీ నర్సింహ్మారావు ఎక్స్ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 135 హైదర్ గూడ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ గుర్తు తెలియని మహిళ దుర్మరణం చెందింది.ఎస్ఐ షమానూర్ తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి...బుధవారం తెల్లవారుజామున 3.30 నిమిషాలకు గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ మహిళ దుర్మరణం చెందింది.ఆమె వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.ఒంటిపై ఆకుపచ్చ చీర దరించి ఉంది.ఆమె సమాచారం తెలిసిన వారు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలన్నారు.మృతదేహాన్ని పోస్టుమార్ధం నిమిత్తం ఉస్మానియా మార్చ్యూరీకి తరలించారు.కేసును రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# దసరా పండుగ రోజు రక్త దానానికి ముందుకు రావడం అభినందనీయం..

ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు.

**కామారెడ్డి,అక్టోబర్21(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఎల్లంపేట గ్రామానికి చెందిన చిన్నరాజయ్య(45) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యులు అత్యవసరంగా ఏపాజిటివ్ తెల్ల రక్తకణాలు అవసరమని తెలియజేయడంతో వారి కుటుంబ సభ్యులు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలును సంప్రదించడంతో ఆయన వెంటనే స్పందించి రక్తదానంతో ఆదర్శంగా నిలుస్తున్న దోమకొండ మండల కేంద్రానికి చెందిన లక్కబత్తిని రవికుమార్ కు తెలియజేయడంతో వెంటనే స్పందించి 44వ సారి తెల్ల రక్తకణాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ...దసరా పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ వారి కుటుంబాలతో ఆనందంగా సంతోషంగా గడుపుతారు కానీ నిస్వార్థపరులైన రక్తదాతలు ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడడానికి పండుగను సైతం పక్కనపెట్టి తెల్ల రక్త కణాలను అందజేయడం అనేది లక్కబత్తిని రవికుమార్ మానవత్వానికి నిదర్శనంగా కనబడుతుందని అన్నారు.ఎవరికి ఏమైతే మనకేంటి మనం బాగున్నాం కదా మనకు ఇతరులతో ఏమి సంబంధం అనుకునే నేటి సమాజంలో ఎలాంటి సంబంధం లేకపోయినా రక్త బంధంతో




ప్రాణాలు కాపాడుతున్న రక్తదాతలు నిస్వార్థ సేవకులని వారి సేవలను గుర్తించాల్సిన అవసరం సమాజానికి ఎంతైనా ఉందని అన్నారు.రక్తదాతకు అభినందనలు తెలియజేయడం జరిగింది.

# ప్రజలతో మమేకమై ఘనంగా అలయ్-బలయ్ వేడుకలు..





ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాసంలో దసరా సందడి..ఆత్మీయ ఆలింగనాలతో శుభాకాంక్షలు

**నారాయణఖేడ్,అక్టోబర్21(సూర్యరేఖ)**దసరా పండుగను పురస్కరించుకొని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాసంలో అలయ్-బలయ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండుగ వేళ ప్రజలతో కలిసి ఆనందాన్ని పంచుకోవడం,పరస్పర ఆప్యాయతను చాటుకోవడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని అలయ్-బలయ్ వేడుకల్లో పాల్గొన్నారు.ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ,ఆలింగనం చేసుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిని ప్రజలు,నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలతో ఆయన ఆత్మీయంగా మమేకమవడంతో నివాస ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.పండుగ సంబరాలు, ఆత్మీయ పలకరింపులతో అక్కడ సందడి కనిపించింది. సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డిని సైతం పలువురు కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

**సోదరభావం,ఐక్యతకు ప్రతీక అలయ్-బలయ్**

తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాల్లో అలయ్-బలయ్ వేడుకలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పండుగల సందర్భంగా ప్రజలంతా ఒకచోట చేరి పరస్పరం ఆప్యాయతను పంచుకోవడం, సోదరభావాన్ని చాటుకోవడం ఈ సంప్రదాయంలోని ప్రధాన విశిష్టత.రాజకీయాలు,ప్రాంతాలు వంటి భేదాలకు అతీతంగా మనుషుల మధ్య అనుబంధాలను బలోపేతం చేసే ఈ వేడుకలు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయి. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకుంటామని, అలయ్-బలయ్ వంటి సంప్రదాయాలు ప్రజల మధ్య ప్రేమాభిమానాలను మరింత పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.పండుగలు కేవలం కుటుంబాలకే పరిమితం కాకుండా సమాజంలోని అందరినీ కలిపే సందర్భాలుగా నిలుస్తాయని తెలిపారు.

**ప్రజలతో ఆత్మీయ కలయిక..**

ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని పండుగ సంతోషాలను పంచుకున్నారు.ఒకరినొకరు పలకరించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకోవడంతో ఆత్మీయ వాతావరణం నెలకొంది.ప్రజాప్రతినిధులు,వివిధ ప్రాంతాల నాయకులు,కార్యకర్తలు, అభిమానులు కలిసి వేడుకల్లో పాల్గొనడం కార్యక్రమానికి మరింత సందడిని తీసుకొచ్చింది.ఈ సందర్భంగా విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు,శాంతి,సౌభాగ్యం తీసుకురావాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ప్రజలందరూ పరస్పర ప్రేమాభిమానాలతో,ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు,వివిధ మండలాల నాయకులు,గ్రామస్థాయి ప్రతినిధులు, యువజన నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అలయ్-బలయ్ వేడుకల్లో భాగస్వాములయ్యారు.

## ప్రజలతో కలిసి అలయ్-బలయ్ వేడుకల్లో పాల్గొన్న జీఎంఆర్

ప్రజలతో ఆత్మీయ కలయిక..విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన గుజ్జపు మచ్చేందర్

**నారాయణఖేడ్,అక్టోబర్21(సూర్యరేఖ)** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన అలయ్-బలయ్ వేడుకల్లో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుజ్జపు మచ్చేందర్ పాల్గొని ప్రజలతో పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ,అందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా ప్రజలతో కలిసి ఆనందంగా గడుపుతూ ఆత్మీయతను చాటుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అలయ్-బలయ్ కార్యక్రమం ప్రజల మధ్య సోదరభావం,ఐక్యత, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు రాజకీయాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకచోట చేర్చి ఆత్మీయ సంబంధాలను బలోపేతం చేస్తాయని తెలిపారు.పండుగల అసలైన ఆనందం అందరితో కలిసి సంతోషాలను పంచుకోవడంలోనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుజ్జపు మచ్చేందర్ మాట్లాడుతూ... విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆశలు, విజయాలు,సుఖసంతోషాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రతి



కుటుంబం ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, రైతులు ,యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరగాలని కోరుకున్నారు.ప్రజల మధ్య ఐకమత్యం, సోదరభావం ఎల్లప్పుడూ కొనసాగాలని,ప్రతి ఒక్కరూ ప్రేమాభిమానాలతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు.ప్రజలతో మమేకమై పండుగ వేడుకల్లో పాల్గొన్న ఆయన,నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ దసరా పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, అందరి జీవితాల్లో శాంతి,సౌభాగ్యం వెల్లివిరియాలని కోరుకున్నారు.

## పద్మారావుగౌడ్ కి దసరా శుభాకాంక్షలు తెలిపిన జీఎస్ఆర్ టిమ్ సభ్యులు



**సికింద్రాబాద్,అక్టోబర్21(సూర్యరేఖ)** విజయదశమి సందర్భంగా జి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని జీఎస్ఆర్ టిమ్ సభ్యులు మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు మిఠాయిలు అందజేసి,ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ నాయకులు మరిపల్లి రవి,నవీన్ చారి, సయ్యద్ సద్దాం,వినోద్ కుమార్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రావణ దహనంలో పాల్గొన్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



**సికింద్రాబాద్,అక్టోబర్21 (సూర్యరేఖ)** చెడుపై మంచి విజయం సాధించడమే విజయదశమి పండుగ విశిష్టతని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ దేవాలయం వద్ద నిర్వహించిన దసరా వేడుకల్లో ఆయన పాల్గొని రావణ దహన కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్,బీఆర్ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్,మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీశ్రీనివాస్,పహాడీ హనుమాన్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ నక్క మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం..

ప్రజల రక్షణలో అమరులైన వీరులకు ఘన నివాళులు..

సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్




**మరిపెడ,అక్టోబర్21(సూర్యరేఖ)** దేశ రక్షణలో,ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడంలో,శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని,విధి నిర్వహణలో ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు,త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్ అన్నారు.పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మరిపెడ మండల కేంద్రంలోని కార్గిల్ సెంటర్‌లో పోలీస్ అమరవీరుల చిత్రపటానికి ఎండి అబ్దుల్ రషీద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశ ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు.1959అక్టోబర్21న లడఖ్‌లో చైనా సైనికుల దాడిలో అమరులైన పది మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు.అమరవీరుల త్యాగనిరతిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని,వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.ప్రజల ప్రాణాలు,ఆస్తుల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాలని ఎండి అబ్దుల్ రషీద్ పేర్కొన్నారు.

## అమ్మవారు మహిషాసురుడిపై విజయం సాధించిన రోజు..మిత్ర కృష్ణ.



**నాంపల్లి ,హైద్రాబాద్, అక్టోబర్21 (సూర్యరేఖ)** పురాణాపూల్ మూసి పరివాహక ప్రాంతంలో దసరా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని జియాగూడ డివిజన్ ధార్మిక సమితి ఆధ్వర్యంలో స్వాగత వేదిక ఏర్పాటు చేసిన నాయకులూ భక్తులకు ఘన స్వాగతం పలుకుతూ రావణ దహనం కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మిత్ర అసోసియేట్స్ చైర్మన్,ఉమ్మడి రాష్ట్ర ఎస్సీ సేల్ మాజీ చైర్మన్ ఆయిందాల కృష్ణ (మిత్రకృష్ణ)పాల్గొన్నారు.ఈ సందర్భముగా ఆలయ కమిటీ సభ్యులు మిత్రకృష్ణను ధార్మిక సమితి మర్యాదపూర్వకంగా ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భముగా మిత్ర కృష్ణ మాట్లాడుతూ. ..ఈ కార్యక్రమానికి మమ్మల్ని ముఖ్యఅతిథులుగా ఆహ్వానించి గౌరవించిన నిర్వాహకులకు మిత్రకృష్ణ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. శ్రీరాముడు రావణుడిపై దుర్గాదేవి అమ్మవారు మహిషాసురుడిపై విజయం సాధించిన శుభదినం అని,పాండవులు అజ్ఞాత వాసం ముగించుకుని జమ్మిచెట్టుపై దాచిన తమ ఆయుధాలను వెలికితీసి విజయం సాధించిన రోజుగాను,అప్పటి నుండి ప్రజలు జమ్మిచెట్టును దర్శించుకుని పూజించడం,బంధుమిత్రులకు జమ్మి ఆకులను ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుకోవడం ఆచారంగా మారిందన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# దాండియా ప్రమాద బాధిత విద్యార్థిని కావ్యకు న్యాయం చేయాలి..

**కేటీఆర్‌ను కోరిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**విద్యార్థినికి మెరుగైన వైద్యం అందిస్తాం..**

**బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం:**

**కేటీఆర్ భరోసా**



**నాచారం,అక్టోబర్21(సూర్యరేఖ)** ఎంవీఎస్ఆర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన దాండియా కార్యక్రమంలో చోటుచేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాచారం డివిజన్‌కు చెందిన విద్యార్థిని కాచం కావ్యకు న్యాయం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను కోరారు.ప్రమాదంలో గాయపడిన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆమె కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఎంవీఎస్ఆర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన దాండియా కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ట్రస్ కూలిపోవడంతో పలువురు విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారు.ఈ దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా,నాచారం డివిజన్‌కు చెందిన విద్యార్థిని కాచం కావ్య తీవ్రంగా గాయపడింది.ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు కాలికి కూడా గాయాలయ్యాయి.ప్రస్తుతం ఆమె సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.అయితే,ప్రమాదం జరిగిన అనంతరం కళాశాల యాజమాన్యం బాధితులకు తగిన ఆర్థిక సహాయం అందించడం లేదని,వైద్య ఖర్చుల విషయంలోనూ బాధ్యత తీసుకోవడం లేదని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.తమ కుమార్తెకు మెరుగైన వైద్యం అందించి, కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.ఈ నేపథ్యంలో నాచారం డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సాయిజెన్ శేఖర్‌తో కలిసి బాధితురాలి కుటుంబ సభ్యులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు.బాధిత కుటుంబ సభ్యుల ఆవేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి,వారిని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వద్దకు తీసుకువెళ్లారు.ప్రమాదానికి సంబంధించిన వివరాలతో పాటు విద్యార్థిని కావ్య ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని ఆయనకు వివరించారు. బాధిత కుటుంబ సభ్యుల సమస్యలను సానుకూలంగా విన్న కేటీఆర్, విద్యార్థినికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.కావ్యకు మెరుగైన వైద్యం అందించే విషయంలో యశోద ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడతామని తెలిపారు.ఈ ప్రమాదానికి సంబంధించి కళాశాల యాజమాన్యం కూడా పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు.బాధిత విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు,ఆమె కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని కేటీఆర్ హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు తమ సమస్యను ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాచం వినయ్ కుమార్,అమరవాణి,బిల్డర్ సాయి, నిఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా పండుగ సందర్భంగా మాజీ మంత్రివర్యులు,



మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి గారికి రాజేంద్రనగర్ అత్తాపూర్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి శ్రీ కొలన్ సుభాష్ రెడ్డి గారి నేతృత్వంలో, కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు శ్రీ ఎస్. వెంకటేష్ గారి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు, మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈరోజు శ్రీనగర్ కాలనీలో శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి గారిని బిఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు, మిత్రులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అందరూ కలిసి అలాయ్ బలాయ్ నిర్వహిస్తూ, పండుగ సంతోషాలను పరస్పరం పంచుకున్నారు. ఈ ఆత్మీయ కలయికతో శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి గారు మాట్లాడుతూ: "మీ అందరి ఆప్యాయత, ఆశీస్సులు, స్నేహం, సహకారం నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. మీరు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ అందరి జీవితాల్లో విజయదశమి కొత్త ఆశలు, ఆనందాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు. ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు శ్రీ ఎస్. వెంకటేష్ గారు మాట్లాడుతూ: "దసరా పండుగ సందర్భంగా మన ప్రియతమ నాయకురాలు శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి గారికి శుభాకాంక్షలు తెలియజేయడం చాలా సంతోషంగా ఉంది. వారి నాయకత్వంలో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను" అని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మిత్రులందరికీ సబితా ఇంద్రారెడ్డి గారు హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి. రమేష్ ముదిరాజు , జె. చిత్తారి , నోముల రాము యాదవ్ , నాయకులు పచ్చ శ్రీనివాస్ , గంజి రాజు , సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి , వాసు బాబు , సునీల్ , వెంకటరమణ , కొంపల్లి జగదీష్ , అరుణ రెడ్డి , రామస్వామి , మోహన్ , సంతోష్ , నాని , మహేందర్ , రిషి , కార్తీక్ , బాలు , అఖిల్ , శశి రాజ్ మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి,మధుబన్ కాలనీల్లో ఘనంగా దసరా వేడుకలు

**జమ్మి పూజలో పాల్గొన్న తోకల శ్రీనివాస్ రెడ్డి మధుబన్ కాలనీలో రావణ దహనం కార్యక్రమం**





**రాజేంద్రనగర్,అక్టోబర్21(సూర్యరేఖ):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి,మధుబన్ కాలనీలలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు,రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.మైలార్‌దేవ్‌పల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పల్లె చెరువు వద్ద నిర్వహించిన జమ్మి పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మధుబన్ కాలనీలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన రావణ దహనం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.పండుగలు మన సంస్కృతి,సంప్రదాయాలను కాపాడటంతో పాటు ప్రజల మధ్య ఐక్యత,సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అందరూ పరస్పర ప్రేమాభిమానాలతో పండుగలను జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు ,బీజేపీ కార్యకర్తలు,కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అందోల్ గ్రామంలో దసరా సంబరాలు..





**అందోల్ ప్రతినిధి,అక్టోబర్21(సూర్యరేఖ)** అందోల్ గ్రామంలో శమీ క్షేత్రం వద్ద దసరా పండగ సందర్భంగా గ్రామ ప్రజలు స్వామి వివేకానంద విగ్రహానికి మరియు హనుమాన్ విగ్రహానికి పూజ నిర్వహించిన అనంతరం చిన్న పెద్ద అందరు కలిసి శమీక్షేత్రంలో ఉన్న జమ్మి చెట్టుకు పూజ నిర్వహించి ఒకరికొకరు అలై బలై తీసుకొని దసరా పండగ శుభాకాంక్షలు అని ఒకరికొకరు చెప్పుకొని సంతోషంగా దసరా సంబరాలు చేసుకున్నారు.

## గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారికి ఇత్తడి కవచం సమర్పణ..



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్21 (సూర్యరేఖ)** హైదరాబాద్లోని చారిత్రాత్మక గోల్కొండ కోటలో కొలువై ఉన్న జగదాంబ మహంకాళి దేవు అమ్మవారికి లంగర్ హౌస్కు చెందిన జి.సంతోష్ గౌడ్,బిజ్జా దుర్గ ప్రసాద్,దుర్గ ప్రసాద్, శశి,రాజేష్,శ్రీకాంత్ తదితర భక్తుల బృందం కలిసి భక్తిశ్రద్ధలతో ఇత్తడి కవచాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అమ్మవారిపై తమకున్న అపారమైన భక్తి,విశ్వాసానికి ప్రతీకగా ఈ పవిత్ర కవచాన్ని సమర్పించామన్నారు.సాంప్రదాయ కళాత్మక ఆకృతులతో, బంగారు వర్ణపు మెరుపులతో రూపొందించిన ఈ ఇత్తడి కవచం అమ్మవారి దివ్యరూపానికి మరింత శోభను చేకూర్చనుందని వారు పేర్కొన్నారు.ప్రజలందరికీ ఆయురారోగ్యాలు,సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధి కలగాలని,అమ్మవారి దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థించామన్నారు.

## నిరు పేదల సొంతింటి కలకు భరోసా..

**జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి**



**అందోల్ ప్రతినిధి,అక్టోబర్21(సూర్యరేఖ)** పేదల సొంతింటి కలకు భరోసా ఇందిరమ్మ ఇల్లు అని జోగిపేట వ్యవసాయ ఢివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి అన్నారు.చౌటకూర్ మండలం తాడ్డానిపల్లి గ్రామానికి చెందిన కాగితాల జయమ్మ-విష్ణువర్ధన్ దంపతులకు ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఇళ్లును మంజూరు చేసింది. ఆరు నెలల పాటు నిర్మాణ పనులు పూర్తి కావడంతో బుధవారం గృహ ప్రవేశం చేశారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందన్నారు. సొంత ఇంటి కల నెరవేరడం ప్రతి పేద కుటుంబానికి ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. సొంత ఇల్లు కుటుంబానికి భద్రతను కల్పించడమే కాకుండా,ఆత్మగౌరవంతో జీవించేం దుకు దోహదపడుతుందని అన్నారు.ఆర్థిక ఇబ్బందులతో సొంత ఇల్లు నిర్మించుకోలేని నిరుపేదలకు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలు ఎంతో తోడ్పాటునందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు,అధికారులు కృషి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయి,లబ్దిదారులు తమ కొత్త ఇళ్లలో గృహ ప్రవేశాలు చేసుకోవడం ఆనందదాయకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోడటప్ల గణేష్మ దిరాజ్,సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు నందికంటి రామచంద్రారెడ్డి, సర్పంచులు పామెనొల్ల అంజమ్మ,గిరంగారి మల్లారెడ్డి,కార్యదర్శి సిద్ధమ్మ,నాయకులు రాములు, రాజశేఖర్,కాశీనాథ్,మౌలనా,శ్రీనివాస్రెడ్డి,ప్రభాకర్రెడ్డి, భానుచందర్, విష్ణు వర్ధన్రెడ్డి, పండరి,బానూరి లక్ష్మయ్య,పాల్గొన్నారు.

## రాక్షపురంకాలనీలో నవరాత్రి యువ సమితి చండీ హోమం,అన్నదానం..



**రక్షాపురం,అక్టోబర్21(సూర్యరేఖ)** రాక్షపురం కాలనీలో నవరాత్రి యువ సమితి ఆధ్వర్యంలో చండీ హోమం,అన్నదానం ఘనంగా నిర్వహించారు.నవరాత్రి యువ సమితి సభ్యులు ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.గత మూడు సంవత్సరాలుగా సుమారు 500నుంచి1,000మంది పైగా భక్తులకు ఘనంగా అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు.నవరాత్రి యువ సమితి సభ్యులు, కాలనీవాసులు కలిసి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ అమ్మవారికి హారతులు,భజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పుతున్నారు.భక్తుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా కొనసాగిస్తున్నారు. నవరాత్రి యువ సమితి టిమ్ సభ్యులు రాకేష్, పరమేష్ సాగర్, శ్రీనివాస్,శ్రీకాంత్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు

**ఎల్లమ్మబండ ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రజా శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేయడం అభినందనీయం**

**శేరిలింగంపల్లి,అక్టోబర్21(సూర్యరేఖ):** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద సమృద్ధిగా వర్షాలు కురవాలని ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరుకాగా,తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.సమృద్ధిగా వర్షాలు కురవాలని,పంటలు బాగా పండాలని,ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజ శ్రేయస్సు,ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించడం మంచి పరిణామమని పేర్కొన్నారు.సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని,రైతులకు మేలు జరగాలని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని వరుణదేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు.ఎల్‌నినో ప్రభావం,వాతావరణ మార్పుల కారణంగా వర్షాలు సరిగా కురవక కరువు పరిస్థితులు ఏర్పడకుండా సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు.అల్లా దయతో ప్రజలందరికీ మంచి జరగాలని,ప్రతి కుటుంబం సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు,ముస్లిం సోదరులు,స్థానిక నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల హామీల అమలులో జాప్యం ఎందుకు.

**కొత్త పింఛన్లు,మహిళలకు రూ.2,500సాయం, బతుకమ్మ చీరలపై విప్లవ కార్మిక సంఘాల జేఏసీ ప్రశ్నలు..**



**బెల్లంపల్లి,అక్టోబర్21(సూర్యరేఖ)** ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తోందని విప్లవ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ప్రశ్నించారు.అర్హులకు కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారు.?మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం ఎప్పటి నుంచి అందిస్తారు.? బతుకమ్మ చీరల పంపిణీ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు.పేదలు,వృద్ధులు, మహిళలు సంక్షేమ పథకాల కోసం ఎదురుచూస్తున్నారని, అమలు కాని హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆరు గ్యారంటీల అమలు స్థితిని వెల్లడించి, మిగిలిన హామీలకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టి. మణి రామ్ సింగ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్;అంబాల మహేందర్, రాష్ట్ర నాయకులు,సింగరేణి గని కార్మిక సంఘం ఎం. పోచమల్లు,రాష్ట్ర కార్యదర్శి,శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం;గజ్జ దుర్గయ్య, బెల్లంపల్లి పట్టణ కాంట్రాక్ట్ వర్కర్స్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిని వర్షిణి కళాశాల చదువుకు రూ.15 వేల ఆర్థిక సాయం

**బండి రమేష్ సేవా సంస్థ ద్వారా విద్యార్థినికి చేయూత ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరం కావొద్దు: బండి రమేష్**




**శేరిలింగంపల్లి, అక్టోబర్21 (సూర్యరేఖ):** ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో టీపీసీసీ ఉపాధ్యక్షుడు,కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తన సేవా సంస్థ ద్వారా విద్యార్థినులకు అండగా నిలుస్తున్నారు.ఈ క్రమంలో బుధవారం కూకట్‌పల్లిలోని శ్రీ హేమ దుర్గా భవన్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విద్యార్థిని డి.వర్షిణికి కళాశాల విద్య కోసం రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే గొప్ప ఆయుధమని అన్నారు.ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా విద్యార్థులు తమ చదువును మధ్యలో ఆపకుండా ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలని సూచించారు.విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తమ తల్లిదండ్రులకు,సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం, విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడటం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు.విద్యార్థుల చదువుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడేందుకు బండి రమేష్ సేవా సంస్థ ద్వారా తన వంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య,కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు కావేటి నాగార్జున,బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్,నరసింహ యాదవ్,ముస్తఫా,రమణ తదితరులు పాల్గొన్నారు.

# మాసాయిపేట 'శ్రీవేంకటేశ్వర వైన్స్'లో బరితెగింపు..

**మైనర్లకు యథేచ్ఛగా మద్యం విక్రయాలు..**
**చట్టాలను తుంగలో తొక్కిన నిర్వాహకులు..లాభాల వేటలో మైనర్ల భవిష్యత్తు బలి**
**కౌంటర్ వద్ద చిన్న పిల్లలకు మద్యం సీసాలు ఇస్తూ కెమెరాకు చిక్కిన వైనం..**
**నిఘా లోపించిన అధికారులు..తక్షణమే స్పందించి లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్..**






**మాసాయిపేట,అక్టోబర్21(సూర్యరేఖ)** మాసాయిపేట మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర వైన్స్ అక్రమాలకు,నిబంధనల ఉల్లంఘనలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది.18ఏళ్ల వయస్సు కూడా నిండని మైనర్లకు మద్యం విక్రయించకూడదనే కఠినమైన ప్రభుత్వ నిబంధనలు ఇక్కడ నవ్వులపాలు అవుతున్నాయి.రూల్స్ పుస్తకాలకే పరిమితం చేస్తూ,లాభాలే పరమావధిగా భావిస్తున్న సదరు వైన్స్ నిర్వాహకులు,చిన్న పిల్లలకు సైతం బహిరంగంగా మద్యం బాటిళ్లను చేతికిస్తూ బరితెగిస్తున్నారు.తాజాగా మాసాయిపేట శ్రీవేంకటేశ్వర వైన్స్ కౌంటర్ వద్ద ఒక మైనర్ బాలుడు నేరుగా నిలబడి మద్యం కొనుగోలు చేస్తుండగా, కౌంటర్ లోని వ్యక్తి ఎలాంటి సంకోచం లేకుండా విక్రయాలు జరిపిన దృశ్యాలు క్షేత్రస్థాయి పరిశీలనలో సాక్ష్యాలతో సహా దొరికాయి.పసి వయసు పిల్లలను వ్యసనాల వైపు నెడుతున్న ఇటువంటి బాధ్యతారాహిత్య ఉదంతం స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు.**

పగలు,రాత్రి తేడా లేకుండా మైనర్లకు ఇంత బహిరంగంగా విక్రయాలు సాగుతున్నా ఎక్సైజ్ మరియు పోలీస్ శాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిఘా లోపం వల్లే వైన్స్ నిర్వాహకులు ఇంతలా రెచ్చిపోతున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.చట్టాలను బేఖాతరు చేస్తూ మైనర్ల జీవితాలతో ఆడుకుంటున్న మాసాయిపేట శ్రీవేంకటేశ్వర వైన్స్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి,వారి షాప్ లైసెన్స్‌ను తక్షణమే రద్దు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పండుగ సాయన్న ఆత్మకు నిజమైన సంతోషం బీసీ-ఏతోనే

**ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చాలి సామాజిక కార్యకర్త రాము ముదిరాజ్**



**నారాయణపేట,అక్టోబర్ 21 (సూర్యరేఖ):** తెలంగాణ ప్రభుత్వం ముదిరాజుల ముద్దుబిడ్డ,తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రకటించడం పట్ల సామాజిక కార్యకర్త రాము ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ముదిరాజుల తరఫున మంత్రి వాకిటి శ్రీహరి,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అయితే పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం మాత్రమే సరిపోదని,ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చినప్పుడే ఆయన ఆత్మకు నిజమైన సంతోషం కలుగుతుందని రాము ముదిరాజ్ అన్నారు.గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముదిరాజులను బీసీ-ఏలోకి మార్చారని,కొద్ది రోజులకే ఆ నిర్ణయం చెల్లదంటూ ముదిరాజు జాతికి అన్యాయం జరిగిందని గుర్తుచేశారు.ముదిరాజుల కోసం విగ్రహాలు ఏర్పాటు చేయడం,జయంతి వేడుకలు నిర్వహించడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని,అయితే వాటితోనే సరిపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.బీసీ-డీ వర్గీకరణ కారణంగా ముదిరాజు యువత అనేక సంవత్సరాలుగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలతో పాటు పలు రంగాల్లో నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.అక్టోబర్ 22న రవీంద్రభారతిలో నిర్వహించనున్న పండుగ సాయన్న జయంతి వేడుకల సభలో ముదిరాజులను బీసీ-ఏలోకి మారుస్తామని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.మూలనపడిన బీసీ-ఏ ఫైలును తిరిగి పరిశీలించి,ముఖ్యమంత్రి సంతకంతో వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ముదిరాజులను బీసీ-ఏలోకి మార్చే వరకు ఎన్ని జయంతి వేడుకలు నిర్వహించినా,ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా ముదిరాజు బిడ్డలు సంతృప్తి చెందరని అన్నారు.ముదిరాజుల సామాజిక,ఆర్థిక అభివృద్ధికి బీసీ-ఏ వర్గీకరణ కీలకమని పేర్కొంటూ,తెలంగాణ ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ముదిరాజు జాతికి న్యాయం చేయాలని రాము ముదిరాజ్ కోరారు.

## నవరాత్రి ఉత్సవాల అనంతరం అమ్మవారి విగ్రహా నిమజ్జనం..

**భక్తిశ్రద్ధలతో పూజలు..కుటుంబ సభ్యులు,బీజేపీ నాయకుల హాజరు**



**రాజేంద్రనగర్,అక్టోబర్ 21 (సూర్యరేఖ)** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాణిక్యమ్మకాలనీలోని సాయికిరణ్ ముదిరాజ్ తమ నివాసం వద్ద నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తితో సేవలు అందించారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం రాత్రి అమ్మవారికి పూజలు నిర్వహించి భారీగా నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.నవరాత్రి ఉత్సవాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య ఐక్యతను చాటుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉమామహేశ్వరి,మహిత, విజయశ్రీ, లావణ్య,పవన్ కుమార్,సుకృత,నారాయణతో పాటు భారతీయ జనతా పార్టీ గోల్కొండ--గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి వై.శ్రీధర్,ధీరజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.స్థానికులు,భక్తుల సమక్షంలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

## సుద్దాల కనకయ్య దశదినకర్మకు హాజరై నివాళులర్పించిన నాతరి స్వామి



**బెల్లంపల్లి,అక్టోబర్21(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని గంగారాంనగర్, 13వ వార్డుకు చెందిన కీ.శే.సుద్దాల కనకయ్య దశదినకర్మ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్,కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి హాజరయ్యారు.ఈ సందర్భంగా సుద్దాల కనకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టయ్య,అసంపల్లి నర్సయ్య, బొడ్డు నీలవర్మ,బండి లక్ష్మణ్,యూత్ నాయకుడు మరపాక వంశీ తదితరులు పాల్గొన్నారు.

## బైకును కారు ఢీకొని అల్మాయిపేట యువకుడు మృతి






**అందోల్ ప్రతినిధి,అక్టోబర్ 21 (సూర్యరేఖ):** అందోల్ మండలం అల్మాయిపేట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన రాయిని శ్రీకాంత్ అనే యువకుడు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.వివరాల్లోకి వెళితే..చౌటకూర్ నుంచి అల్మాయిపేట గ్రామానికి బైక్‌పై వస్తున్న శ్రీకాంత్ యూటర్న్ తీసుకుంటున్న సమయంలో ఎర్రారం వైపు నుంచి వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టినట్లు సమాచారం.ఈ ప్రమాదంలో శ్రీకాంత్ తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయాడు.వెంటనే అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు తెలిసింది.ప్రమాద ఘటనపై స్థానిక ఎస్సై గిరి తన సిబ్బందితో కలిసి పరిశీలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.కాగా ,161వ జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు గతంలో మూడు ఫ్లైఓవర్ల నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు పత్రికల్లో ప్రకటనలు వచ్చినప్పటికీ,క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అల్మాయిపేట గ్రామం వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టి ఉంటే ఇలాంటి ప్రమాదాలను నివారించే అవకాశం ఉండేదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై అవసరమైన ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి,మరిన్ని ప్రాణాలు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పత్తికుంట వద్ద భారీగా అమ్మవారి విగ్రహాల నిమజ్జనం

భక్తులకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సౌకర్యాలు..

క్రేన్,లైటింగ్,మంచినీటి వసతి కల్పన నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు,పోలీసులు



**రాజేంద్రనగర్,అక్టోబర్ 21 (సూర్యరేఖ)** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్‌లోని పత్తికుంట వద్ద అమ్మవారి విగ్రహాల నిమజ్జన కార్యక్రమం భారీగా కొనసాగింది.చుట్టుపక్కల ప్రాంతాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.నిమజ్జన ప్రాంతంలో తొలిసారిగా క్రేన్ సౌకర్యంతో పాటు లైటింగ్,మంచినీటి వసతి తదితర సదుపాయాలను కల్పించారు.నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేలా జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి,డీసీ సురేందర్ రెడ్డి,ఎస్సీ నరేందర్ గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.పోలీసు శాఖ తరపున ఏసీపీ శ్రీనివాస్,సీఐ వెంకటేష్,ట్రాఫిక్ సీఐ బోసు ఆధ్వర్యంలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ భక్తులకు అవసరమైన సహకారం అందించారు.నిమజ్జన ప్రాంతంలో రద్దీని నియంత్రిస్తూ భద్రతా చర్యలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ కన్వీనర్ వై.శ్రీధర్,ఈ. వేణుగోపాల్‌తో పాటు సమితి సభ్యులు,సేవా బృందం పాల్గొన్నారు.భక్తులకు అవసరమైన సౌకర్యాలు అందేలా చూస్తూ నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేందుకు సహకరించారు. అధికారులు, పోలీసులు, ఉత్సవ సమితి సభ్యుల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమం కొనసాగింది.

## మహాలక్ష్మిపూజలో ధర్మపత్నితో శ్రీపరశురామ సేవసంస్థ అధ్యక్ష నవరతన్ ఇండోరియా..



**నాంపల్లి,హైద్రాబాద్, అక్టోబర్21(సూర్యరేఖ)** గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోని తాళ్లగడ్డ ప్రాంతంలో ప్రముఖ సంఘ సేవకులు శివకుమార్ వారి ధర్మపత్ని భాగ్యలక్ష్మి దంపతుల ఆద్వర్యంలో మహాలక్ష్మి పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ అమ్మవారి పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా శ్రీపరశురామ సేవసంస్థ అధ్యక్ష నవరతన్ ఇండోరియా ధర్మపత్ని లలితా ఇండోరియాలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి,అమ్మవారి కృపకు పాత్రులై,భక్తులకు తీర్థ ప్రసాద వితరణలో భాగస్వాములైనారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందారు.ప్రజలందరూ సుఖసంతో షాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో లోకేష్ ఇండోరియా,సోవురబ్ ఇండోరియా,వికాస్ కుమార్,గణేష్ కుమర్,దత్తాత్రేయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలకు ఏర్పాట్లు

నారాయణపేటలో తొలిసారిగా అధికారికంగా జయంతి నిర్వహణ

ముదిరాజ్ సంఘం నాయకుల ఆహ్వానం




**నారాయణపేట,అక్టోబర్ 21 (సూర్యరేఖ):** తెలంగాణ రాబిన్‌హుడ్‌గా,ప్రజా వీరుడిగా పేరుగాంచిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను తొలిసారిగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న నేపథ్యంలో నారాయణపేట జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.అక్టోబర్ 22,గురువారం ఉదయం 10 గంటలకు నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ చేతుల మీదుగా జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు.కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమం అనంతరం ఉదయం 10.30 గంటలకు చౌక్‌బజార్‌కు చేరుకుని పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు.అక్కడి నుంచి శ్రీ సత్యనారాయణ స్వామి చౌరస్తాకు వెళ్లి సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నారు.ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ జయంతి వేడుకల్లో ముదిరాజ్ పెద్దలు,సంఘం నాయకులు,యువత,సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమాచారాన్ని ప్రతి ముదిరాజ్ కుటుంబానికి చేరవేసి,అందరూ వేడుకలకు హాజరయ్యేలా చూడాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్,పట్టణ అధ్యక్షుడు బి.వెంకటయ్య,ముదిరాజ్ సంఘం యువత అధ్యక్షుడు,కౌన్సిలర్ ఎ.రాము తదితరులు ఆహ్వానం పలికారు.

## ఎల్లంపేటలో ప్రతి బుధవారం అంగడి సంత..

ప్రజలకు అందుబాటులో నిత్యావసర వస్తువులు..

సంతను ప్రారంభించిన సర్పంచ్ గండి రాధమ్మ

సంతను సద్వినియోగం చేసుకోవాలి..



**మరిపెడ,అక్టోబర్21(సూర్యరేఖ)** మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో ప్రతి బుధవారం అంగడి సంత నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ గండి రాధమ్మ తెలిపారు.బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన అంగడి సంతను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ స్వయంగా కూరగాయలు కొనుగోలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గండి రాధమ్మ మాట్లాడుతూ.. .గ్రామ ప్రజలకు నిత్యావసర వస్తువులు,కూరగాయలు అందుబాటులో ఉండేలా అంగడి సంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ సంత ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.స్థానికంగా కూరగాయలు,ఇతర నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు.ప్రతి బుధవారం నిర్వహించే అంగడి సంతను గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,నాయకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహణ..



**సికింద్రాబాద్, అక్టోబర్21(సూర్యరేఖ)** సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీనివాస్ నగర్ కాలనీలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మరియు శ్రీవిరాట్ విశ్వకర్మ పరిరక్షణ సమితి అధ్యక్షులు శ్రీవేములవాడ మహాత్మాచారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు.కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,ఆటపాటలతో కోలాహలంగా వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వేములవాడ మహాత్మాచారి మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని,తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప పండుగ అని అన్నారు. విశ్వకర్మ బిడ్డలు ఎల్లప్పుడూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ముందుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వారి సతీమణి వేములవాడ నాగలక్ష్మి, కుమారుడు వేములవాడ వంశీ కృష్ణ,కుమార్తె వేములవాడ వైష్ణవి,తో పాటు, మాజీ సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్,చంద్రశేఖర్, అజ్గర్ అలీ, జియావుద్దీన్,ఘౌస్ భాయ్,రఫీక్,షకీల్ భాయ్,ప్రతాప్ రెడ్డి,రామ్ రెడ్డి,జగన్,మరియు ఇతర కార్యకర్తలు,కాలనీ సభ్యులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చోరీ కేసును చేదింపు..నిందితుడు రిమాండు దామరగిద్ద ఎస్సైనరేష్




**దామరగిద్ద,అక్టోబర్21(సూర్యరేఖ)** దామరగిద్ద మండలం,విఠలాపురం గ్రామంలో ఈనెల 13వ తేదీన కుర్వ అనంతమ్మ ఇంట్లో చోరీ కేసును దామరగిద్ద ఎస్సైనరేష్ ఆధ్వర్యంలో పోలీసులు చేదించారు.ఈ ఘటనపై సిఆర్,నెంబర్ 152/2026,యు/ఎస్ 331(3)305 బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు, ఈ కేసులో దామరగిద్ద మండలం విట్లపూర్ గ్రామానికి చెందిన ఘనపురం హన్మంత్ (46)ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.అతని నుంచి రూ.40వేలు,తులం బంగారు ఆభరణాలు (గెంటీలు)పోలీసులు స్వధీనం చేసుకున్నారు. చోరీ కేసును త్వరితగతిని చేధించి,పోయిన సొత్తును రికవరీ చేసిన దామరగిద్ద ఎస్సై నరేష్ మరియు పోలీసులు సిబ్బందిని ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీస్ అభినందిచారు,

## పోలీస్ అమరవీరులకు ఘన నివాళి..



**మంథని,అక్టోబర్21(సూర్యరేఖ)**పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంథని ఎస్ఐ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద మంథని పోలీసులు అమరవీరులకు నివాళులర్పించారు.కాగా విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల ఆస్తులు మాన ప్రాణాలు శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మంథని ఏఎస్ఐలు,హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు

## దసరా రోజు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు మృతి..

మండుగుల శ్రీనివాస్ కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం..

భార్యకు వారసత్వ ఉద్యోగం కల్పించాలని యూనియన్ డిమాండ్..




**రాజేంద్రనగర్,అక్టోబర్ 21 (సూర్యరేఖ)** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న మండుగుల శ్రీనివాస్(40)దసరా పండుగ రోజు సాయంత్రం అకస్మాత్తుగా మరణించడం ఆయన కుటుంబానికి తీరని లోటని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు.మరణించిన కార్మికుడి కుటుంబాన్ని ఆయన పరామర్శించి, శ్రీనివాస్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు ఆకస్మికంగా మరణించడం బాధాకరమని అన్నారు.కార్మికుడి మృతి విషయాన్ని శానిటేషన్ అదనపు కమిషనర్ సి.ఎన్.రఘు ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి దహన సంస్కారాల ఖర్చులు అందించాలని కోరినట్లు వెల్లడించారు.దీనిపై స్పందించిన అదనపు కమిషనర్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్లుతో మాట్లాడి కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని సూచించారు.దీంతో అల్వాల్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్లు ఆదేశాల మేరకు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ ద్వారా మరణించిన కార్మికుడి భార్య మండుగుల రేణుకకు దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ.10,000 అందజేశారు. అంతేకాకుండా బాధిత కుటుంబానికి అండగా నిలవాలని,మరణించిన కార్మికుడి భార్యకు వారసత్వ ఉద్యోగం కల్పించాలని జైపాల్ రెడ్డి అధికారులను కోరారు.కార్మికుల కుటుంబాలకు కష్టకాలంలో ప్రభుత్వం,మున్సిపల్ అధికారులు అండగా నిలవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మున్సిపల్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఐ.శ్రీనివాస్,అల్వాల్ మున్సిపల్ అధ్యక్షురాలు కౌసర్ బాయి,కె.శ్రీనివాస్,ఎం.కె.పి. స్వామి,డి. నాగేష్,దోర్నాల లక్ష్మీ నరసమ్మ,కుంట భారతి తదితరులు పాల్గొన్నారు.

# చెడుపై మంచి విజయానికి ప్రతీక విజయదశమి..



ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్

మరిపెడలో ఘనంగా దసరా వేడుకలు..

రావణ దహనం



**మరిపెడ,అక్టోబర్ 21(సూర్యరేఖ)** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ అన్నారు.విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మరిపెడ పట్టణంలో మంగళవారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు.మండల పరిషత్ కార్యాలయ ఆవరణతో పాటు మరిపెడ శివాలయం దేవుని మాన్యంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయదశమి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు.చెడుపై మంచి,అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి రావణ దహనం ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ అమ్మవారి షమీ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.మరిపెడలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.దసరా వేడుకలతో పట్టణ కేంద్రంలో పండుగ సందడి నెలకొంది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోతు రవినాయక్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పానుగోతు రాంలాల్,కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు,నాయకులు, ప్రజలు,నిర్వాహకులు,తదితరులు పాల్గొన్నారు.

## నాచారం వీరసావర్కర్ నగర్‌లో ఘనంగా కాలనీ అసోసియేషన్ షెడ్ నిర్మాణానికి భూమిపూజ..

ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక సహకారంతో షెడ్ నిర్మాణం





**నాచారం, అక్టోబర్21 (సూర్యరేఖ)** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నాచారం డివిజన్ పరిధిలోని వీరసావర్కర్ నగర్‌లో కాలనీ అసోసియేషన్ నూతన షెడ్ నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది.కాలనీవాసుల సౌకర్యార్థం చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో నిర్మాణం ఈ సందర్భంగా పోతగాని గోపాల్ గౌడ్ మాట్లాడుతూ... మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రత్యేక సహకారం, నిధులతో వీరసావర్కర్ నగర్ కాలనీవాసుల సౌకర్యార్థం నూతన షెడ్ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.కాలనీవాసుల దీర్ఘకాలిక అవసరాన్ని గుర్తించి, షెడ్ నిర్మాణానికి సహకారం అందించిన ఎంపీ ఈటల రాజేందర్‌కు కాలనీ ప్రజలు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు,బీజేపీ నాయకుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కాలనీలో సామాజిక, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఈ షెడ్ ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.కాలనీవాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ పనులు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వీరసావర్కర్ నగర్ కాలనీ కమిటీ అధ్యక్షుడు వెంకటరమణరెడ్డి,ప్రధాన సలహాదారు మధుసూదన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి రమేష్,సలహాదారు శుక్లాజీ,అసోసియేషన్ సభ్యులు లక్ష్మారెడ్డి, భాస్కర్,ఈశ్వర్ ప్రసాద్,బాలరాజ్, వెంకటేష్,శ్రీశైలం గౌడ్,శ్రీహరి,ప్రభాకర్ చారి, జగన్మోహన్ రావు,వీర ప్రతాప్,శ్రీనివాస్,శ్రావణ కుమార్,రామకృష్ణ, నగేష్,శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు,స్థానిక నాయకులు,వీరసావర్కర్ నగర్ నివాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కన్నెపల్లిలో సర్పంచులు, నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే వినోద్ సమావేశం..

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ. హర్షం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు



**బెల్లంపల్లి,అక్టోబర్21(సూర్యరేఖ)** బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి బుధవారం కన్నెపల్లి గ్రామంలో సర్పంచులు, ముఖ్యనాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు,అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై ఎమ్మెల్యే వినోద్ సానుకూలంగా స్పందిస్తూ,వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.తమ సమస్యలను సానుకూలంగా విని స్పందించడంతో సర్పంచులు,నాయకులు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింగరావు,సర్పంచులు,ముఖ్య నాయకులు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ బైలెల్లి నాది అందోల్ గ్రామంలో అంగరంగా వైభవంగా దుర్గామాత ఊరేగింపు కార్యక్రమం ..



**అందోల్ ప్రతినిధి,అక్టోబర్21(సూర్యరేఖ)**దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా10వ రోజు దసరా సంగారెడ్డి జిల్లా అందోల్ గ్రామంలో విఠలేశ్వర దేవాలయంలో నుండి విశ్వహిందూ పరిషత్ అందోల్ సమితి ఆధ్వర్యంలో శ్రీదుర్గామాత అమ్మవారికి మంగళవారం ఉదయం దీక్ష స్వాములు వైభవంగా పూజలు నిర్వహించి అనంతరం శ్రీదుర్గా మాత విగ్రహాన్ని అందంగా అలంకరించిన ట్రాక్టర్ ట్రాలీలో ఆశీనులు గావించినా దీక్షా స్వాములు కమిటీ సభ్యులు అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంను భక్తులకు కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది.జైదుర్గా జైమాత అంటూ గ్రామ వీధుల గుండా దుర్గామాత ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగింది.ప్రతి ఇంటి నుండి మహిళలు మంగళ హారతులతో అమ్మ వారికీ స్వాగతం పలికి అగరవత్తులు వెలిగించి టెంకాయ కొట్టి పసుపు కుంకుమలతో పూజించారు.ఈ వేడుకలో మహిళలు చిన్నారులు భవాని స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గామాత పాటలకు నృత్యాలు చేశారు.అనంతరం సాయంత్రం దుర్గామాత మహిషాసురుని సంహరించిన అనంతరం గ్రామ చెరువులోకి ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం జరిపారు.ఈ కార్యక్రమంలో దీక్షా స్వాములు ,భక్తులు,మహిళలు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాపన్‌పల్లిలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం

బ్యాంకింగ్ సేవలు,ఖాతాదారుల హక్కులపై అవగాహన ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన



**నారాయణపేట,అక్టోబర్ 21 (సూర్యరేఖ):** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం బాపన్‌పల్లి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ పథకంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యత,బ్యాంకింగ్ సేవలు, ఖాతాదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం సురేష్,ఎస్‌బీఐ దామరగిద్ద శాఖ మేనేజర్ నోవా,బాపన్‌పల్లి గ్రామ సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్,లింగారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మొగులప్ప,బాపన్‌పల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొడ్డు నర్సింహులు,రైతులు,గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బ్యాంకింగ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని,బ్యాంకు ఖాతాల నిర్వహణ,డిజిటల్ బ్యాంకింగ్,యూపీఐ చెల్లింపులు,నెట్ బ్యాంకింగ్‌పై అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచించారు.ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు,ఓటీపీ,పిన్ వంటి రహస్య సమాచారాన్ని వెల్లడించవద్దని వివరించారు.ఖాతాదారులకు ఉన్న హక్కులు,బ్యాంకింగ్ సేవల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు.బ్యాంకింగ్ సేవలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే ముందుగా సంబంధిత బ్యాంకులో ఫిర్యాదు చేయాలని,అక్కడ పరిష్కారం లభించని పక్షంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఆశ్రయించవచ్చని తెలిపారు.ఆర్‌బీఐ అధికారిక ఫిర్యాదుల పోర్టల్‌తో పాటు 14448 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా కూడా సంబంధిత సమాచారం పొందవచ్చని వివరించారు.రైతులు,గ్రామీణ ప్రజలు బ్యాంకింగ్ సేవలపై సరైన అవగాహన పెంపొందించుకుని తమ ఆర్థిక లావాదేవీలను సురక్షితంగా నిర్వహించుకోవాలని సూచించారు.ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడంతో పాటు ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించేందుకు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## మణికొండలో అలయ్ బలయ్‌తో ఆత్మీయ శుభాకాంక్షలు..

దసరా వేడుకల్లో పాల్గొన్న నాయకులు,మిత్రులు





**మణికొండ,అక్టోబర్21 (సూర్యరేఖ)**దసరాపండుగను పురస్కరించుకుని మణికొండలోని భాగ్యలక్ష్మి నివాసి వెంకటేశ్వరరెడ్డి తన నివాసంలో విందు ఏర్పాటు చేసి అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఆత్మీయంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు, మిత్రులు,ఆత్మీయులు ఒకరికొకరు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అనంతరం ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ పండుగ సంతోషాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి,మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణరెడ్డి,పలువురు నాయకులు,మిత్రులు పాల్గొన్నారు.దసరా పండుగ ఐక్యతకు, స్నేహభావానికి ప్రతీకగా నిలుస్తుందని,అలయ్ బలయ్ వంటి కార్యక్రమాలు పరస్పర అనుబంధాలను మరింత బలోపేతం చేస్తాయని నాయకులు పేర్కొన్నారు.పండుగలు కులమతాలకు అతీతంగా ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయని,ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు సమాజంలో ఐక్యతను చాటిచెబుతాయని అన్నారు.ఆనందోత్సాహాల మధ్య దసరా పండుగను జరుపుకుంటూ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మాజీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ ని కలిసిన వేములవాడ మహాత్మాచారి



**సికింద్రాబాద్,అక్టోబర్21(సూర్యరేఖ)** దసరా పండుగ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మరియు శ్రీవిరాట్ విశ్వకర్మ పరిరక్షణ సమితి అధ్యక్షులు శ్రీవేములవాడ మహాత్మాచారి సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే మరియు మాజీ శాసనసభ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ నివాసానికి వెళ్లి దసరా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి,వారి కుమారులు కిషోర్ గౌడ్,కిరణ్ గౌడ్,రామేశ్వర్ గౌడ్, శ్రీత్రినేత్ర గౌడ్,లను కూడా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు రాజేష్,అజ్గర్ అలీ,జియావుద్దీన్,తదితరులు పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

శ్రీనగర్ కాలనీలో అలాయ్ బలాయ్‌తో ఆత్మీయ కలయిక కొలన్ సుభాష్ రెడ్డి నేతృత్వంలో పాల్గొన్న నాయకులు,కార్యకర్తలు



**రాజేంద్రనగర్,అక్టోబర్ 21 (సూర్యరేఖ):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డికి రాజేంద్రనగర్ అత్తాపూర్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ సుభాష్ రెడ్డి నేతృత్వంలో,కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు,స్థానిక ప్రజలు,మిత్రులు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనగర్ కాలనీలోని సబితా ఇంద్రారెడ్డి నివాసానికి చేరుకున్న నాయకులు,కార్యకర్తలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అలాయ్ బలాయ్ నిర్వహిస్తూ పరస్పరం ఆలింగనం చేసుకుని పండుగ సంతోషాలను పంచుకున్నారు. దీంతో ఆమె నివాసంలో పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తనపై చూపిస్తున్న ఆప్యాయత,ప్రేమాభిమానాలు,సహకారం ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని తెలిపారు. అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు,ఆనందాలు,ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ తమ ప్రియతమ నాయకురాలు సబితా ఇంద్రారెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉందన్నారు. ఆమె నాయకత్వంలో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు,మిత్రులందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి.రమేష్ ముదిరాజు,జె.చిత్తారి,నోముల రాము యాదవ్,పచ్చ శ్రీనివాస్,గంజి రాజు,సమ్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి,వాసు బాబు,సునీల్, వెంకటరమణ, కొంపల్లి జగదీష్,అరుణ రెడ్డి,రామస్వామి, మోహన్,సంతోష్, నాని,మహేందర్,రిషి,కార్తీక్,బాలు,అఖిల్,శశి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి పెట్టాలి...

రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించేలా కృషి చేయాలి



**సూర్యపేట :** ంంవరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించి భారీ మెజారిటీతో గెలిపించేందుకు ఇప్పటి నుంచే సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కొత్తగూడెంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వచ్చే నెల 6వ తేదీ వరకు కొనసాగనున్న పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రులను నేరుగా కలిసి నమోదు ప్రక్రియ పూర్తయ్యేలా సహకరించాలని పిలుపునిచ్చారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి నిర్వహించాలని నాయకులు పేర్కొన్నారు. ఓటరు నమోదు ప్రక్రియతో పాటు ఎన్నికల సన్నాహాల్లోనూ పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొని సమిష్టి కృషితో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పోతు భాస్కర్, రాంరెడ్డి చరణ్ రెడ్డి, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు, మాజీ డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్యతో పాటు కొత్తగూడెం నియోజకవర్గ నాయకులు, మండల, బ్లాక్, పట్టణ, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనాజిపురంలో యాట బలి వేడుకల్లో పాల్గొన్న కొప్పుల వేణారెడ్డి

**సూర్యాపేట :** పెన్ పహాడ్ మండలం అనాజిపురం గ్రామంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మత్స్యకారులు ఆనవాయితీగా నిర్వహించే సంప్రదాయ యాట బలి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి సంప్రదాయ వేడుకల్లో పాల్గొన్న ఆయన, గ్రామ ప్రజల ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ వారితో ఆత్మీయంగా మమేకమయ్యారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి వేడుకలు గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యతను, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మిడిమేలకు దామోదర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ అనుములపూరి నాగయ్య, ఉపసర్పంచ్ చెన్ను భరత్ రెడ్డి, వార్డు సభ్యులు చెన్ను కృష్ణారెడ్డి, లింగమ్మ మల్లయ్య, ముస్తఫా, అనుములపూరి రాజు, లక్కపాక విలేకర్, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు చెన్ను జయమ్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాంపల్లి సైదులు, దాసరి మట్టయ్య, మండల అగ్రికల్చర్ డైరెక్టర్ మట్టపల్లి వెంకట నర్సు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కుందమల్ల శేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు వెన్న ఉపేందర్, కోడి కిరణ్, పిల్లల నాగరాజు, షేక్ నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

## అందోల్ విశ్వహిందూ పరిషత్ సమితి ఆధ్వర్యంలో దుర్గామాత ఊరేగింపు..

కనుల పండుగగా అంబరాన్ని అంటిన దుర్గామాత ఊరేగింపు సంబరాలు.





**అందోల్ ప్రతినిధి,అక్టోబర్ 21 (సూర్యరేఖ)** అందోల్ గ్రామంలో అంబరాన్ని అంటిన సంబరాలు దుర్గమ్మ ఊరేగింపు ఘనంగా జరుగుతున్నాయి. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 10వ రోజు ( దసరా)సంగారెడ్డి జిల్లా అందోల్ గ్రామంలో విఠలేశ్వర దేవాలయంలో నుండి విశ్వహిందూ పరిషత్ అందోల్ సమితి ఆధ్వర్యంలో శ్రీదుర్గామాత అమ్మవారికి మంగళవారం ఉదయం దీక్ష స్వాములు వైభవంగా పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదుర్గామాత విగ్రహాన్ని అందంగా అలంకరించిన ట్రాక్టర్ ట్రాలీలో ఆశీనులు గావించినా దీక్షా స్వాములు కమిటీ సభ్యులు అమ్మవారి ఊరేగింపు భక్తులకు కన్నుల పండుగగా నిర్వహించారు. జై దుర్గా జైమాత అంటూ గ్రామ వీధుల గుండా దుర్గామాత ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. ప్రతి ఇంటి నుండి మహిళలు మంగళ హారతులతో అమ్మ వారికీ స్వాగతం పలికి పసుపు కుంకుమలతో పూజించారు. ఈ వేడుకలో మహిళలు చిన్నారులు,భవాని స్వాములు,పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గామాత పాటలకు నృత్యాలు చేశారు. అనంతరం అందోల్ గ్రామ పెద్ద చెరువులోకి ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమర్జనం జరిపారు. ఈ కార్యక్రమంలో దీక్షాస్వాములు,భక్తులు, మహిళలు,చిన్నారులు, గ్రామస్తులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భారతీయ వరి పరిశోధన సంస్థలో స్వచ్ఛత కార్యక్రమం




**రాజేంద్రనగర్,అక్టోబర్ 21 (సూర్యరేఖ):** భారతీయ వరి పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 21న సంస్థ ప్రధాన ద్వారం ఎదుట స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం,పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంస్థ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్,డాక్టర్ ప్రసాద్ బాబు,డాక్టర్ సాయి ప్రసాద్,డాక్టర్ అంతుల్ వారిస్,డాక్టర్ లక్ష్మీప్రసన్న,సంస్థ పరిపాలనాధికారి గీతాంశు కుమార్,సాంకేతిక అధికారులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సంస్థ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సూచించారు.

## మహిళలు దుర్గాదేవి స్ఫూర్తితో సంస్కృతి, దేశాన్ని కాపాడాలి

**। చేవెళ్ల :-** శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక విభాగం రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్ ఆర్. నరేష్ కుమార్ (సతీష్ కుమార్) మాట్లాడుతూ, మహిళలు దుర్గాదేవి స్ఫూర్తితో హిందూ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలను తక్కువగా చూడటం, వారిపై హింసకు పాల్పడటం సమాజానికి హానికరమని పేర్కొన్నారు. దుర్గాదేవి రాక్షస సంహారం ద్వారా దుష్టశక్తులపై విజయానికి ప్రతీకగా నిలిచిందని, నేటి మహిళలు కూడా ధైర్యసాహసాలతో అన్ని రంగాల్లో ముందుకు సాగాలని అన్నారు. దేశ రక్షణలో మహిళా సైనిక అధికారులు, సిబ్బంది అందిస్తున్న సేవలు, ధైర్యసాహసాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేవీ నవరాత్రులు ఆధ్యాత్మికతతో పాటు మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతాయని, ప్రతి ఒక్కరూ ఇలాంటి పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ సభ్యులు మురళీకృష్ణ, వెంకటేష్, మధు, ఆంజనేయులు, విజయానంద్, పండరినాథ్, వడ్డే వెంకటేష్, బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక విభాగం నవాబ్‌పేట మండల కో-కన్వీనర్ కేదారి ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## దసరా పర్వదినం సందర్భంగా పెద్దమ్మతల్లి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి కుటుంబసభ్యులు

తెలంగాణా ప్రజలకు ముఖ్యమైన దసరా పండుగ సందర్భంగా మంగళవారం పాల్వంచ మండలం పరిధి జగన్నాథపురం - కేశవాపురం గ్రామాల్లో కొలువై వున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మతల్లి గుడి) లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, ఐజమీా మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు, సతీమణి పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు, కుటుంబసభ్యులు పూజల్లో పాల్గొన్నారు. దసరా పండుగ సందర్భంగా పెద్దమ్మతల్లిని వేలాది మంది భక్తులు దర్శించుకొని, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, కుమార్తె సీతాల అనూష, కుమారుడు కొత్వాల శివేంద్ర వినయ్, కుటుంబసభ్యులు, నాయకులు చింతా నాగరాజు, గంధం నరసింహారావు, గంధం సతీష్, బూసి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## గడాల శ్రీనివాసరావుకు మద్దతు తెలపండి..

జనసేన పార్టీ నాయకుడు పిఓసి మెంబర్ ప్రసాద్



**కామారెడ్డి,అక్టోబర్21(సూర్యరేఖ)** ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గాడాల శ్రీనివాసరావుకు మద్దతు తెలిపి గెలిపించుకుందామని కామారెడ్డి నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకుడు పిఓసి మెంబర్ ప్రసాద్ అన్నారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. జనసేన పార్టీ ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాస్ రావు సేవలు, ప్రజా కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేయాలని,అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా జనసేన నాయకులు,జనసైనికులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా కృషి చేయాలని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో జనసేన పార్టీ నెంబర్ స్థానంలో ఉంటుందని ఆయన వెల్లడించారు.

## విజయదశమి సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ జమ్మి పూజ



**బెల్లంపల్లి,అక్టోబర్ 21(సూర్యరేఖ)** బెల్లంపల్లి విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జమ్మి చెట్టుకు శమీ పూజను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక అని అన్నారు. ఈ పర్వదినం ప్రజలందరికీ విజయాలను అందించాలని,అందరికీ శుభం కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దావ స్వాతిరమేష్ బాబు,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, కౌన్సిలర్లు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీఎఫ్ మహబూబాబాద్ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక..

జిల్లా అధ్యక్షుడిగా షేక్ మన్సూర్ అలీ..

ప్రధాన కార్యదర్శిగా బానోత్ లక్ష్మణ్..

జిల్లా ఉపాధ్యక్షులుగా బోడ రామ్‌జీ,రవీందర్..




**మరిపెడ,అక్టోబర్21(సూర్యరేఖ)** స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్టీఎఫ్) మహబూబాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా షేక్ మన్సూర్ అలీ,ప్రధాన కార్యదర్శిగా బానోత్ లక్ష్మణ్,ఉపాధ్యక్షులుగా బోడ రామ్‌జీ,టి. రవీందర్,జిల్లా కార్యదర్శులుగా కిన్నెర శ్రీనివాస్,దుప్పటి రవి,మహిళా అధ్యక్షురాలిగా బి.నిర్మల, కోశాధికారిగా లచిరామ్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పెరుమాళ్ల చంద్రశేఖర్,సారా ఫాతిమా,మాంగీలాల్ నియమితులయ్యారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పలువురు ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్షుడిగా షేక్ మన్సూర్ అలీ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## అందోల్ గ్రామంలో దసరా సంబరాలు.



**అందోల్ ప్రతినిధి,అక్టోబర్ 21(సూర్యరేఖ)** అందోల్ గ్రామంలో శమీక్షేత్రం వద్ద దసరా పండగ సందర్భంగా గ్రామ ప్రజలు స్వామి వివేకానంద విగ్రహానికి మరియు హనుమాన్ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం చిన్న పెద్ద అందరు కలిసి శమీక్షేత్రంలో ఉన్న జమ్మి చెట్టుకు పూజ నిర్వహించి అలై బలై తీసుకొని దసరా పండగ సంతోషంగా దసరా సంబరాలు చేసుకున్నారు.

## భోగి' సినిమా నుంచి అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటే సాంగ్

చార్మింగ్ స్టార్ శర్వా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' ప్రమోషనల్ కంటెంట్‌తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 1960ల ప్రారంభంలో మహారాష్ట్ర?ఆదిలాబాద్ సరిహద్దు నేపథ్యంలో సాగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. గ్రామీణ సంప్రదాయాలు, మానవ సంబంధాలు, సామాజిక పరిస్థితులతో ముడిపడిన సహజమైన పల్లెటూరి ప్రపంచాన్ని ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి ఆసక్తిని రేకెత్తించగా, తొలి పాట 'ఎగిలివారంగ' సినిమాలోని పల్లె వాతావరణంతో కూడిన సంగీత ప్రపంచాన్ని పరిచయం చేసింది. దసరాకు ఒక రోజు ముందు మేకర్స్ ఈ సినిమా నుంచి రెండో పాట 'అన్నయ్య పానం' ను విడుదల చేశారు. ఐదుగురు చెల్లెళ్లపై ఒక అన్నయ్య చూపించే నిస్వార్థమైన ప్రేమ, ఆప్యాయతలను హృద్యంగా ఆవిష్కరించే ఈ పాటతో పాటు, ప్రధాన జంట ప్రేమకథకు సంబంధించిన కొన్ని అందమైన క్షణాలను కూడా చూపించారు. పల్లెటూరి మట్టి వాసనతో కూడిన పాటలను అందించడంలో ప్రత్యేకత కలిగిన సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను మనసు ఆకట్టుకునేల స్వరపరిచారు.భావోద్వేగాల లోతుతో సాగే ఈ మెలోడీ వినగానే ఆకట్టుకుంటుంది. ఆస్కార్ విజేత, గీత రచయిత చంద్రబోస్ సాహిత్యంతో పాటకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే అనురాగం, త్యాగం, విడదీయలేని అనుబంధాన్ని తన సాహిత్యంలో అందంగా ఆవిష్కరించారు.

సింగర్ శ్రీకృష్ణ తన వోకల్స్ తో ఈ పాటకు ప్రాణం పోశారు. ఆయన వాయిస్ పాటలోని భావోద్వేగాలను మరింత పెంచుతుంది. కథలోని రొమాంటిక్ కోణాన్ని కూడా ఈ పాట ఆవిష్కరిస్తుంది. శర్వా, అనుపమ పరమేశ్వరన్ పాత్రల మధ్య కెమిస్ట్రీని అందంగా చూపించారు. అనీ మాస్టర్ కొరియోగ్రఫీ పాటలోని భావానికి చక్కగా సరిపోగా, సహజమైన పల్లెటూరి వాతావరణం, ఆప్యాయతతో కూడిన కుటుంబ సన్నివేశాలు విజువల్స్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి.

పల్లెటూరి యువకుడిగా శర్వా తన సహజమైన లుక్‌తో ఆకట్టుకున్నారు. నిజాయితీతో కూడిన నటనతో తన పాత్రకు భావోద్వేగాల లోతును జోడించారు. పాటలో ప్రధానంగా కనిపించే అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఆయన నటన మరింత సహజత్వాన్ని తీసుకొచ్చింది. పల్లెటూరి అమ్మాయిగా అనుపమ పరమేశ్వరన్ అందంగా ఆకట్టుకున్నారు. అద్భుతమైన నటన, మనసును తాకే సాహిత్యం, అందమైన విజువల్స్ కలగలిసి ఈ పాటను 'భోగి' సంగీత ప్రయాణంలో గుర్తుండిపోయే పాటగా నిలబెట్టాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్‌తో పాటు డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. కిశోర్ కుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటించనున్నారు. నటీనటులు: చార్మింగ్ స్టార్ శర్వా, అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి





## 'ఆది రుద్ర' సినిమా పోస్టర్ మోషన్ వీడియో రిలీజ్

ఆది సాయికుమార్ హీరోగా త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రంతో ఆసక్తికరమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది. దైవిక , అతీంద్రియ రహస్యాలు, ఉత్కంఠభరితమైన సస్పెన్స్ కలగలిసిన కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రశాంత్ జి. రుద్రప్ప నిర్మిస్తున్న ఈ చిత్రానికి నవరసన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. దసరా పర్వదినం సందర్భంగా మేకర్స్ ఈ సినిమాకు పవర్‌ఫుల్ టైటిల్‌ను ప్రకటిస్తూ ఆకట్టుకునే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'ఆది రుద్ర' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ పోస్టర్‌లో ఆది సాయికుమార్ త్రిశూలం పట్టుకుని, వెనక్కి తిరిగి నిలబడిన తీరు ఆకట్టుకుంటోంది. లో యాంగిల్‌లో రూపొందించిన ఈ కంపోజిషన్ ఆయన ఇంటెన్స్ ప్రజెన్స్ మరింత ప్రభావవంతంగా చూపిస్తోంది. ఆకాశాన్ని తాకేలా కనిపించే భారీ పర్వతాకార నిర్మాణంపై దుర్గామాత రూపం దర్శనమిస్తోంది. మరోవైపు, వెలుగుతున్న కాగడాలు పట్టుకున్న భారీ జనసమూహం వృత్తాకారంలో ఉన్న యజ్ఞస్థలాన్ని చుట్టుముట్టిన దృశ్యాలు పోస్టర్‌కు మరింత మిస్టరీని జోడిస్తున్నాయి. మనిషికి, అతీంద్రియ ప్రపంచం పథ్యంలో ఈ కథ సాగనుందనే ఆసక్తిని ఈ విజువల్స్ కలిగిస్తున్నాయి. 1960ల నుంచి 1990ల మధ్య కాలంలో జరిగే కథతో 'ఆది రుద్ర' తెరకెక్కుతోంది. ఈ ప్రత్యేకమైన పీరియడ్ నేపథ్యం సినిమాలోని పాత్రలు, విజువల్ స్టైల్, ఆ కాలం నాటి వాతావరణాన్ని మళ్లీ సృష్టిస్తూ, ఆసక్తికరమైన దైవిక రహస్యాన్ని మిళితం చేసి ప్రత్యేకమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించాలనేది మేకర్స్ లక్ష్యం. ఈ చిత్రానికి ఏజే శెట్టి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. 'కాంతార', 'విరూపాక్ష', 'మంగళవారం', తమిళ బ్లాక్‌బస్టర్ 'మహారాజా' చిత్రాలతో గుర్తింపు పొందిన ప్రముఖ సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మోషన్ వీడియోకు ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ డివైన్ వైబ్ ను అద్భుతంగా ఆవిష్కరిస్తోంది.






## 30న వస్తున్న 'ఆదర్శ కుటుంబం'

అగ్ర హీరో వెంకటేష్ అంటేనే కుటుంబ కథా చిత్రాలకు పెట్టింది పేరు. ఇక మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దాదాపు ఇరవైఏండ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'ఆదర్శ కుటుంబం-హౌస్ నంబర్ 47 (ఏకే 47)'. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు, హాస్యం, యాక్షన్ కలబోతగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం బుధవారం ప్రకటించింది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, కుటుంబ ప్రేక్షకులు మెచ్చే సంపూర్ణ వినోదాత్మక చిత్రమిదని మేకర్స్ తెలిపారు. శ్రీనిధిశెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాత: ఎస్.రాధాకృష్ణ (చినబాబు), సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: త్రివిక్రమ్ శ్రీనివాస్

## దుష్ట శిక్షణలో కనకదుర్గ

నిధి అన్వేషణ ప్రధాన ఇతివృత్తంగా రూపొందిస్తున్న చిత్రం 'సన్ ఆఫ్ కనకదుర్గమ్మ'. లయ, అనురూప్ కటారి, ఆకాంక్ష త్యాగరాజన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి దుర్గ ఫణిందర్ దర్శకుడు. దసరా సందర్భంగా ఈ సినిమా స్పెషల్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాతలు అశ్వనీదత్, స్వప్నదత్ విడుదల చేశారు. ఇందులో నటి లయ అమ్మవారి అవతారంలో శక్తివంతంగా కనిపిస్తున్నారు. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగే ఈ కథలో విజువల్స్, యాక్షన్ ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయని, దుష్టశిక్షణ గావించే అమ్మవారి అవతారంలో లయ కనిపించే సన్నివేశాలు ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందిస్తాయని చిత్రబృందం పేర్కొన్నది. ఈ చిత్రానికి సంగీతం: శశిధర్ లంక, కథ: కాకర్ల గోవర్ధన రావు, నిర్మాతలు: వాణి శంకర్, తిలోత్తమ, దర్శకత్వం: దుర్గ ఫణిందర్ లంక.



Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713